# “తటస్థంగా ఉండడం మనం చేస్తున్న పెద్ద నేరం”
# ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ప్రభుత్వం, సల్వాజుడుం, నక్సలైట్లు పాల్పడుతున్న హింస

## సంక్షిప్తం

> *‘ఈకాలంలో పుట్టినందుకు ఏపాపం చేసుకున్నామో అని పదే పదే అనుకుంటాం. మా జీవితాలు దుర్భరంగా తయారయ్యాయి. నక్సలైట్లు వచ్చి భోజనం పెట్టమని బలవంతం చేస్తారు, పోలీసుల కదలికలు చెప్పమని వత్తిడి చేస్తారు, వాళ్ళకు సహాయపడమంటారు. తరవాత, పోలీసులు వస్తారు – కొడతారు, నక్సలైట్ల సమాచారం అడుగుతారు. మేము ఇద్దరిమధ్యలో నలిగిపోతున్నాం. బయటపడే మార్గమేది కనపడ్డంలేదు.’*
>
> – ప్రభుత్వం నిర్వహిస్తున్న క్యాంపులో, ఒక ఎర్రబోరు నివాసి (జనవరి 2008)

మధ్య భారతంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బయటి ప్రపంచానికి కొంచెమే తెలిసిన ఈ దారుణమైన సమరం జూన్ 2005 నుంచి ఇప్పటి వరకు వందల గ్రామాలను బుగ్గిపాలు చేసింది. పదుల వేలల్లో ప్రజలను నిరాశ్రయులను చేసింది. ఒకపక్క సాయుధ మావోయిస్టులు; మరోపక్క ప్రభుత్వ భద్రతాదళాలూ, సల్వాజుడుం ఒకరిపైన మరొకరు పోటాపోటీగా చేసుకుంటున్న భీతావాహ సమరంలో పౌరులు బలవుతున్నారు. మానవహక్కుల అవహేళన జరుగుతూ ఉంది. హత్యలూ, చిత్రహింసలూ, లైంగిక హింసా, బలవంతపు తరలింపు సర్వసాధారణం అయిపోయాయి.

పేద ప్రజల హక్కులను, ప్రధానంగా భూమిలేని, దళిత, ఆదివాసీ ప్రజల ప్రయోజనాలను కాపాడే లక్ష్యంతో నాలుగు దశాబ్దాలుగా పనిచేస్తూ – నక్సలైట్లుగా పేరుపొందిన సాయుధ మావోయిస్టు ఉద్యమాలు, నేడు 13 రాష్ట్రాలకు విస్తరించాయి. రోజురోజుకూ పెరిగిన వీరి సాయుధ దాడుల ఫలితంగా స్వయంగా ఈ దేశ ప్రధాని, 2006లో ‘నక్సలైట్ ఉద్యమమే ఈరోజు దేశం ఎదుర్కొంటున్న ప్రధాన ఆంతరంగిక భద్రతా సమస్య’ అన్నాడు.

1980ల నుంచే ఛత్తీస్‌గఢ్ దక్షిణ ప్రాంతాలలో నక్సలైట్ల ఉనికి బలంగా ఉంది. వారు చేపట్టిన చర్యల వలన – ఆర్థిక దోపిడీ, అరాచకాలు తగ్గిపోయి స్థానిక ఆదివాసీలలో మంచిపట్టే సంపాయించినప్పటికీ నక్సలైట్ ఉద్యమాలు రోజురోజుకూ హింసాత్మకం కావడం, తిండీ డబ్బులు దండుకోవడం, బలవంతపు రిక్రూట్‌మెంట్లు, ద్రోహులనీ, ఇన్ఫార్మర్లనీ పేరుపెట్టి చేస్తున్న హత్యలు, పెరగడంవల్ల నక్సలైట్లపైన స్థానికులలో విముఖత పెరుగుతూ వచ్చింది.

నక్సలైట్లపైన ప్రజలలో పెరుగుతూ వచ్చిన అసంతృప్తి, వ్యతిరేకత – ఒక రూపం తీసుకొని సల్వాజుడుం అనే ప్రభుత్వ ప్రేరేపిత ప్రైవేట్ సైన్యం బిజాపూర్ జిల్లాలో జూన్ 2005లో ఆవిర్భవించింది. అతి కొద్దికాలంలోనే వేగంగా, దంతెవాడ, బిజాపూర్ జిల్లాలలోని వందల గ్రామాలకు సల్వాజుడుం కార్యక్రమాలు విస్తరించాయి. ప్రభుత్వ భద్రతాదళాల సంపూర్ణ సహాయ సహకారాలతో సల్వాజుడుం సభ్యులు, నక్సలైట్లకు మద్దతు ఇస్తున్నారనే నెపంతో వందల గ్రామాలపైన క్రూరమైన దాడులు చేశారు. ప్రజలను బెదిరించి సల్వాజుడుంలో చేర్చుకున్నారు. పదుల వేల సంఖ్యల్లో ప్రజలను బలవంతంగా ప్రభుత్వం నడుపుతున్న క్యాంపులకు తరలించారు. సల్వాజుడుంలో చేరడానికి ఒప్పుకోనివారినీ, క్యాంపులను వదిలి పారిపోయినవారినీ భయంకరంగా హింసించారు.

ప్రభుత్వ సహకారంతో త్వరత్వరగా విస్తరిస్తున్న సల్వాజుడుం క్యాంపులపైనా క్యాంపు నివాసులపైనా నక్సలైట్ల ఎదురుదాడి మొదలైంది. ఎస్‌పిఓలుగా నియమించబడ్డారని భావించిన క్యాంపు నివాసులనూ, పోలీసు ఇన్‌ఫార్మర్లుగా గుర్తించినవారినీ, సల్వాజుడుం నాయకులనూ, మద్దతుదారులనూ – కిడ్నాప్ చేయడం, చంపడం మొదలైంది.

ప్రజలకు తటస్థంగా ఉండే అవకాశం, నక్సలైట్లూ ఇవ్వలేదు, ప్రభుత్వమూ ఇవ్వలేదు. ఒకవైపు నుంచి రక్షణ కోరితే మరొకవైపునుంచి అపాయం పొంచి ఉన్నట్టే. ఎవరైనా జర్నలిస్టులో, సామాజిక కార్యకర్తలో – సల్వాజుడుం, ప్రభుత్వదళాలు పాల్పడుతున్న హింస గురించి రాయడమో, పరిశోధించడమో చేస్తే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వాళ్ళను 'నక్సలైట్ల సానుభూతిపరులు'గా ముద్రవేసి, అనుక్షణం భయంతో జీవించేలా చేస్తుంది లేదా ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక ప్రజా భద్రతా చట్టం, 2005 కింద, విచక్షణ లేకుండా అరెస్టులు చేస్తుంది.

సల్వాజుడుం భయానక హింసను ప్రయోగిస్తూ, ప్రజల ప్రాణాలను హరిస్తూ, ఆస్తులను ధ్వంసం చేస్తున్నదని కొందరు అధికారులు గుర్తించినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ హింసను నివారించే, నిలిపే ఏవిధమైన చర్యలు తీసుకోకపోగా కనీసం హింసకు పాల్పడుతున్నవారిని బాధ్యులుగా కూడా చేయడం లేదు. ఏప్రిల్, 2008న ఈ అఘాయిత్యాలపైన విచారణ జరపవలసిందిగా, సుప్రీంకోర్టు – నేషనల్ హ్యూమన్ రైట్స్ కమీషన్ను (ఎన్‌హెచ్‌ఆర్‌సి) ఆదేశించింది.

రెండుపక్కలనుంచీ జరుగుతున్న హింసనూ హక్కుల ఉల్లంఘనలనూ ఎన్‌హెచ్‌ఆర్‌సి సమగ్రంగా పరిశోధించగలదనే ఆశ ఉన్నప్పటికీ చాలామంది విశ్లేషకుల నమ్మకం ఏమంటే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు – ఆదివాసీల హక్కులను గుర్తించడంలో, పరిరక్షించడంలో విఫలమయ్యాయని గుర్తించి, ఆ హక్కులను తిరిగి నిలబెట్టడానికి తగు చర్యలు తీసుకునేంతవరకూ నక్సలైటు ఉద్యమం పెరుగుతూనే ఉంటుందని. తక్షణం ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వాలు అవలంభించిన విధానాల ఫలితంగా జరిగిన మానవహక్కుల ఉల్లంఘనలను, అమానవీయ సంఘటనలను సరిదిద్దే ప్రయత్నం మొదలుపెట్టాలి, బాధ్యులందర్నీ విచారించాలి.

## ప్రభుత్వం, సల్వాజుడుంల హింస

'నక్సలైట్లకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు చేపట్టిన ఐచ్ఛిక, శాంతియుత ఉద్యమమే – సల్వాజుడుం' అని

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ సల్వాజుడుంలో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యక్ష భాగస్వామ్యం ఉందనీ సల్వాజుడుం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి అనేక హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారని – హ్యూమన్ రైట్స్ వాచ్ సేకరించిన అనేక ఆధారాలు తెలుపుతున్నాయి.

గడచిన రెండున్నర సంవత్సరాల కాలంలో (జూన్ 2005 నుండి సెప్టెంబర్ 2007) ప్రభుత్వ భద్రతా దళాలు, సల్వాజుడుం కలిసి నక్సలైట్ల సానుభూతిపరులను గుర్తించడం, నక్సలైట్లకు సహాయపడగలరని భావించిన వాళ్ళను గ్రామాలనుంచి తరలించడం లక్ష్యంగా, అసంఖ్యాక దాడులను నిర్వహించారు. బిజాపూర్, దంతెవాడ జిల్లాలలో వందలాది గ్రామాలపైన జరిగిన ఈ దాడులలో బెదిరించడం, కొట్టడం, నిర్విచక్షణగా అరెస్టులు, నిర్బంధం, హత్యలూ ఆస్తుల దోపిడీ, సల్వాజుడుంలో చేరేలా బలవంతం – యధేచ్ఛగా కొనసాగాయి. పోలీస్‌స్టేషన్ల, పారామిలిటరీ దళాల క్యాంపుల పక్కన, హైవేల వెంట, ప్రభుత్వమే ఏర్పాటుచేసి నడుపుతున్న శిబిరాలలోకి వేలసంఖ్యలలో ప్రజలను తరలించారు. ఇలా తరలించబడి క్యాంపులలో ఉంటున్న వాళ్ళను, చివరకు పిల్లలను కూడా సల్వాజుడుంలో చేరమని బలవంత పెడుతున్నారు. సల్వాజుడుం ఆదేశాలను పాటించకపోతే జరిమానాలను కూడా విధిస్తున్నారు.

సల్వాజుడుం, జూన్ 2005 నుండి సెప్టెంబర్ 2007 వరకు ఒకవైపు గ్రామాలమీద అనేక దాడులు చేస్తూనే క్యాంపులు వదిలి గ్రామాలకు తిరిగి వెళ్ళిన వారిపైన కిరాతక ప్రతీకార దాడులకు కూడా పాల్పడుతూ ఉంది. అంతేకాకుండా ప్రభత్వ భద్రతాదళాలు కూడా నక్సలైట్లనే పేరుతో 'ఎన్‌కౌంటర్ల'లో అనేకమందిని చంపుతున్నారనీ ఈ మరణాలు సాయుధ సంఘర్షణలో జరుగుతున్నట్లు చిత్రీకరించడం పూర్తి అబద్ధమని, అనేక వార్తలు వ్యాప్తిలో ఉన్నాయి.

పోలీసులు, పౌరులను నిరంకుశంగా అరెస్ట్ చేస్తున్నారు, ప్రశ్నిస్తున్నారు, చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు క్యాంపు నివాసులను స్పెషల్ పోలీసు ఆఫీసర్లుగా (ఎస్‌పిఓ) నియమించి, పారామిలటరీ దళాలతో కలిపి నక్సలైట్ వ్యతిరేక కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈ ఎస్‌పిఓలు నక్సలైట్లు చేసే సాయుధ దాడులలో, మందుపాతరలూ ఇతర పేలుడు పదార్థాలు పేల్చడం వల్లనో, నక్సలైట్ల ప్రతీకార హత్యలలోనూ మరణించే అవకాశం ఉంది.

పిల్లలను కూడా ఎస్‌పిఓలుగా నియమిస్తున్నట్టు, స్థానిక ప్రభుత్వేతర సంస్థలు (ఎన్‌జిఓలు) 2006 నుండే రిపోర్టు చేస్తున్నాయి. ఎస్‌పిఓలుగా నియమించబడ్డ పిల్లలందర్నీ, ఆ హోదానుంచి వెంటనే తొలగిస్తామని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ప్రకటించింది. వారి వయస్సును తెలియజేసే రికార్డులేవీ లేకపోవడంవల్లనే ఈ నియామకాలు జరిగాయని కొందరు అధికారులు అంటారు. అయినప్పటికీ, ఎస్‌పిఓలుగా చేర్చుకున్న పిల్లలను గుర్తించే, వేరుచేసే ప్రక్రియ మొదలైనట్టు హ్యూమన్ రైట్స్ వాచ్ దృష్టికి రాలేదు. బాల ఎస్‌పిఓల ప్రాణాలకు హాని జరిగే అవకాశం ఇప్పటికీ అలాగే ఉంది.

నిత్యమూ జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనల ఫలితంగా ప్రజలు భారీసంఖ్యలో నిర్వాసితులైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యను పరిష్కరించడానికి ఇంతవరకు పూనుకోలేదు. డిసెంబర్ 2007 నాటికి,

దంతెవాడ, బిజాపూర్ జిల్లాలలో ప్రభుత్వం నెలకొల్పిన 24 శిబిరాలలోకి 49,000 మంది తరలించబడ్డారు. ఇంకా ఎక్కువమందే ఛత్తీస్‌గఢ్‌లోని ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళారు. దాదాపు 65,000 మంది పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌లకు తరలి వెళ్ళారనీ; అందులో 30,000 నుండి 50,000 వరకు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారని ఒక అంచనా.

బలవంతంగా క్యాంపులకు తరలించబడీ, తప్పించుకున్నవారు ఇరుగుపొరుగు రాష్ట్రాలకు పారిపోయి, మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఈ నిర్వాసితులకు రక్షణ, సహాయం అందించే ఒక సమగ్ర విధానాన్ని, కేంద్ర ప్రభుత్వం గానీ ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌ల రాష్ట్ర ప్రభుత్వాలు గానీ ఇంతవరకు రూపొందించలేదు. ఈ నిర్వాసితులందరూ తమ ఇళ్ళనూ, భూములనూ, పశుసంపదలనూ, ప్రధాన జీవనాధారమైన వ్యవసాయాన్ని కోల్పోయారు. ఇక క్యాంపుల్లో – ఇరుకైన కొట్టాలలో, అపరిశుభ్ర వాతావరణంలో, చిన్న వైద్య సహాయం కూడా లేకుండా రోజులు వెళ్ళదీస్తున్నారు. క్యాంపులలో ఉన్న వాళ్లలో అతికొద్ది మందికి మాత్రమే చిన్నా చితకా ఉద్యోగాలు ఉన్నాయి. నామమాత్రపు ఆదాయం లేదా అస్సలు ఆదాయమే లేనివాళ్లే ఎక్కువ. మొదట్లో, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వమే బియ్యమూ, పప్పులాంటి రేషన్ ఉచితంగా కొన్ని క్యాంపులలో ఇచ్చేది. ఒక్కోసారి ఇచ్చే రేషన్ కూడా బాగా తగ్గించేవారట. బిజాపూర్, దంతెవాడ జిల్లాలలో అనధికార ఆవాసాలలోనూ పక్కా ఇళ్ల కాలనీలు అని పిలవబడే ప్రభుత్వ నిర్మాణాలలోనూ మరికొంతమంది నిర్వాసితులు నివసిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఈ కాలనీలలో, క్యాంపుల్లో ఉన్న కనీస సౌకర్యాలు కూడా లేవని, ప్రభుత్వమే చెబుతుంది.

ఆంధ్రప్రదేశ్‌కు పారిపోయిన ఆదివాసీలు కడు దయనీయ పరిస్థితులలో జీవిస్తున్నారు. భూమిని కొనుక్కోవాలనుకున్నా, కౌలుకు తీసుకోవాలనుకున్నా చేతిలో ఒక్క పైసా కూడా లేని వీళ్లు – అడవుల్లో గుడిశెలేసుకొని జీవిస్తున్నారు. ఈ ఆవాసాలు చట్ట వ్యతిరేకమని ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ అధికారులు పదే పదే వీళ్లను తరుముతున్నారు. ఉన్న అతికొద్ది వస్తువులనూ, నివాసాలనూ ధ్వంసం చేస్తున్నారు. దౌర్జన్యం చేస్తున్నారు. హ్యూమన్ రైట్స్ వాచ్ సందర్శించిన ఒక ఆవాసాన్ని జనవరి 2007 నుండి మొదలుపెట్టి ఇప్పటివరకు పదిసార్లు ధ్వంసం చేశారని తెలిసింది. ఫారెస్ట్ అధికారులు ఏ విధమైన ముందస్తు సంప్రదింపులూ లేకుండా ఒకచోటి నుండి మరోచోటికి తరుముతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'స్థానికులు' కాదన్న కారణంగానూ ఇతర కారణాల వల్లనూ ఈ ఆదివాసీలకు రేషన్ బియ్యం లాంటి ప్రభుత్వ పథకాలనూ, ఉపాధి హామీ పథకాన్నీ, మరే ఇతర ప్రభుత్వ ప్రయోజనాలనూ కల్పించడం లేదు.

సల్వాజుడుం విస్తరణ, దాని ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో ఏటగట్ట గ్రామస్తులు వాళ్ల అనుభవాలనుండి వివరించారు. ఒక ప్రత్యక్షసాక్షి హ్యూమన్ రైట్స్ వాచ్‌తో చెప్పిన ప్రకారం: ఏటగట్ట, దంతెవాడ జిల్లాలో యాభైగడప ఉండే ఒక ఊరు. 2006, ఎండాకాలంలో ప్రభుత్వ భద్రతా దళాలూ, సల్వాజుడుం కలిసి ఆ ఊరిపైన హఠాత్తుగా దాడిచేశారు, దొరికినవారిని దొరికినట్లు చితకబాదారు, ఇళ్లల్లో ఉన్న వస్తువులనూ పశుసంపదనూ లూటీ చేశారు, మొత్తం 50 ఇళ్లను బుగ్గిపాలు చేశారు.

ఒక ప్రత్యక్ష సాక్షి మాటల్లో ......

> సల్వాజుడుం, పోలీసులు కలిసి మా ఊళ్లో 15 మందిని చంపారు. 5 గురు స్త్రీలు 10 మంది పురుషులు. అందరూ పెద్దవాళ్లే, ఇంచుమించు నా వయస్సు వాళ్లే ముప్పైకి అటుఇటుగా ఉంటారు. వాళ్లు, అయిదుగురిని గొంతుకోసి చంపారు. అందులో ఒకరు మహిళ. ఆ ఐదుగురూ నాకు బాగా తెలుసు. వాళ్లను చంపడానికి నాకే కారణమూ కనపడలేదు. వాళ్లలో ఇద్దరికి నేను దహన సంస్కారాలు చేశాను. ఉంగి అనే 13 ఏళ్ల అమ్మాయిని రేప్ చేసి చంపారు. మరొకామె (పేరు పేర్కోవడం లేదు) పైన సామూహిక అత్యాచారం జరిగింది. ఆమెను ఊళ్లోనే అనేకమంది అత్యాచారం చేసి, పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి మళ్లీ అత్యాచారం చేసి, విడుదల చేశారు.
>
> నలుగురు మగవాళ్లను, పదిమంది ఆడవాళ్లను భద్రతా దళాలూ, సల్వాజుడుం వాళ్లు బలవంతంగా వారివెంట తీసుకెళ్లారు. ఆడవాళ్లు మాత్రం వెనక్కు వచ్చారు. మగవాళ్లు రాలేదు. ఇప్పటివరకూ, వాళ్లేమయ్యారో ఎవ్వరికీ తెలియదు.

విపరీతమైన భయానికి గురయిన గ్రామస్తులంతా పారిపోయి చాలా రోజులు అడవుల్లో దాచుకున్నారు. ఆచోటు తెలుసుకున్న భద్రతా దళాలూ, సల్వాజుడుం కలిసి మళ్లీ దాడి చేశారు. గ్రామస్తులందరూ ప్రాణాలరచేతపట్టుకొని, సురక్షిత ప్రాంతంగా భావించి చివరకు ఆంధ్రప్రదేశ్ చేరుకున్నారు. కానీ వాళ్లు అలా వచ్చి పాకలు వేసుకోగానే చట్ట విరుద్ధమనీ, అది అటవీ భూమనీ ఆరోపిస్తూ ఫారెస్ట్ అధికారులు వాళ్ల గుడిశెలను కాల్చేశారని, ఫారెస్ట్ అధికారులనుండి వాళ్లకు ఎదురైన విషాద అనుభవాన్ని వివరించారు. ఒక బాధితుడు ఇలా చెప్పాడు:

> పన్నెండు నుంచి ఇరవైమంది దాకా ఫారెస్ట్ అధికారులు జీపుల్లో వచ్చేవారు. రావడంతోనే గుడిశెల్లోంచి మమ్మల్నందరినీ బయటకు ఈడ్చి, ఎట్లంటే అట్ల కొట్టేవారు. ఆడవాళ్లను కూడా వదిలేవాళ్లు కాదు. ఛూథీయా, బోసిడికే, సాలే ...... అడవిని నరుకుతార్రా ..... అని తిట్టేవాళ్లు. కొన్నిసార్లు, ఒక్కరోజులోనే రెండు మూడుసార్లు కూడా వచ్చేవారు. మా గుడిశెలను ఐదారు సార్లు కాల్చారు. కాల్చిన ప్రతిసారీ మేము మళ్లీ వేసుకొనేవాళ్లం. మళ్లీ వేసుకునేంతవరకు అడవిలో చెట్లకింద ఉండేవాళ్లం.

చివరకు, స్థానికుల సహాయం వలన, ఏటగట్ట నుంచి విస్థాపితులయి వచ్చిన గ్రామస్తులు కొంచెం కుదురుకున్నారు. ఇంతలో వాళ్ల మకాం సల్వాజుడుం వాళ్లకు తెలిసిపోయిందని భయాందోళనలకు గురయ్యారు. 2007 సంవత్సరం మధ్యలో – సల్వాజుడుం, వాళ్ల కొత్తమకాంను చేరుకొంది. స్థానిక సర్పంచ్ అడ్డుపడి, ఇటీవల గ్రామానికి ఎవరూ రాలేదని చెప్పి, సల్వాజుడుంను వెనక్కి పంపగలిగాడు. ఇప్పటికీ, ఏటగట్టనుంచి వచ్చిన గ్రామస్తులందరూ తీవ్ర భయాందోళనల్లోనే జీవిస్తున్నారు.

## నక్సలైట్ల హింస

నక్సలైట్లు చాలా తీవ్రమైన హింసాత్మక ఘటనలకు బాధ్యులు. పేద ప్రజల ప్రత్యేకించి ఆదివాసీల సమానత్వం, సామాజిక న్యాయం కోసం 'ప్రజాయుద్ధాన్ని' నడుపుతున్నామని, చెప్పుకుంటారు. అయినప్పటికీ, ప్రజలను వాళ్లు కోరుకున్న పనులు చేయాలని బలవంత పెడుతున్నారు, వేధిస్తున్నారు, బెదిరిస్తున్నారు, కొడుతున్నారు, దోచుకుంటున్నారు, విచక్షణ లేకుండా హత్యలు చేస్తున్నారు. వాళ్లకు సహకరించడం లేదనో, పోలీసు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారనో అనేక రకాల శిక్షలు వేస్తున్నారు. డబ్బులకోసం, తిండికోసం, ఆశ్రయం కోసం వత్తిడి పెడుతున్నారు. పిల్లలను దళాలలో చేర్చుకొని భద్రతా దళాల మీద సాయుధ దాడులకు వాడుకుంటున్నారు; మందుపాతరలను పేల్చడం, ఇతర పేలుడు పదార్థాలు ఉపయోగించడం నేర్పుతున్నారు. ఇలాంటి పేలుళ్లలో ఇప్పటికి అనేకమంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు.

ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారనో, ద్రోహం తలపెట్టారనో ఆరోపించి, సంబంధిత వ్యక్తులను పిలిచి, వాళ్ల ప్రజాకోర్టు అని పిలిచే ఒక విచారణాకార్యక్రమాన్ని నిర్వహించి శిక్షిస్తున్నారు, హత్యలు చేస్తున్నారు. ఈ 'ప్రజాకోర్టు'ల్లో 'ముద్దాయిలకు' న్యాయసహాయం ఉండదు, అప్పీలు ఉండదు. పైగా నిష్పాక్షికమైన న్యాయమూర్తులు ఉండరు. ఈ ప్రజాకోర్టులు గ్రామనాయకులకూ, సంపన్నులకూ వ్యతిరేకంగా కూడా వినియోగించబడతాయి. భూయజమానులను ఈ కోర్టులకు పిలిచి వాళ్ల భూమిలో కొంత భాగాన్ని, పేదలకు పంచమని ఆదేశిస్తారు. ఈ ఆదేశాలను వ్యతిరేకించిన వాళ్లను కొడతారు.

నక్సలైట్లకు వ్యతిరేకంగా తరచుగా వచ్చిన ఫిర్యాదులు ఏమంటే – తిండి, డబ్బులు సమకూర్చమని వత్తిడి చేస్తారనీ, డబ్బులను చందాగా ఇవ్వడానికి నిరాకరించిన వాళ్లను చంపుతామని బెదిరిస్తారని, వాళ్ల మీటింగులకు హాజరు కానీ వాళ్లకు జరిమానా విధిస్తారని, కుటుంబాన్ని పోషించడానికే సరిపోయేన్ని తిండిగింజలు లేనప్పుడు కూడా ధాన్యం ఇవ్వమని బలవంతం చేస్తారని కొందరు గ్రామస్తులు తెలిపారు.

సిపిఐ (మావోయిస్టు) పార్టీ పిల్లలను సైనికావసరాలకు వినియోగిస్తుంది. 16 సంవత్సరాల పిల్లలను కూడా దళాలలో చేర్చుకోవచ్చన్నది ఆ పార్టీ విధానం, ఆచరణ కూడా. ఆరు నుండి పన్నెండు సంవత్సరాల మధ్య ఉండే పిల్లలను బాలల సంఘాలలో చేర్చుకొని మావోయిస్టు సిద్ధాంతాలను బోధిస్తారు. ఇన్‌ఫార్మర్లుగా ఉపయోగించుకుంటారు. ప్రాణహాని కలిగించని ఆయుధాలను వినియోగించడం నేర్పుతారు (కర్రసాము లాంటివి) క్రమంగా ఇతర మావోయిస్టు సంస్థలైన చైతన్య నాట్య మంచ్ (కళా బృందం), గ్రామ సంఘం, ప్రజా మిలీషియా, సాయుధ దళం తదితర రూపాలలోకి 'ప్రమోట్' చేస్తారు. శారీరక ధారుఢ్యం ఉండి, సరిపోతారు అనుకున్న పిల్లలను నేరుగా దళాల్లోకి తీసుకుంటారు. మావోయిస్టుల అన్ని అనుబంధ సంఘాల్లో పనిచేసే పిల్లలందరికీ ఆయుధాలను ఉపయోగించడం, మందుపాతరలను పేల్చడం నేర్పుతారు.

ప్రజామిలీషియా, సాయుధ దళాలలో ఉండే పిల్లలు, ప్రభుత్వ భద్రతా దళాలతో జరిగే కాల్పులలో పాల్గొంటారు. బాలలసంఘం, చైతన్య నాట్య మంచ్, గ్రామ సంఘాలల్లో ఉండేవాళ్లు ప్రత్యక్ష యుద్ధతంత్రంలో

భాగం కానప్పటికీ, భద్రతా దళాలు చేపట్టే కూంబింగ్ ఆపరేషన్లకు బలవుతూ ఉంటారు. సాయుధ దళాలను వదిలిపోయిన సభ్యుల – కుటుంబ సభ్యులపైనా, స్నేహితులపైనా నక్సలైట్లు దాడులు చేస్తారు, కొన్ని సార్లు హత్యలు కూడా చేశారు.

సల్వాజుడుం వ్యాప్తిపట్ల నక్సలైట్ల ప్రతిస్పందన చాలా హింసాత్మకంగా ఉంది. క్యాంపుల మీద చేసిన దాడులలో చాలా మంది పౌరులను, సల్వాజుడుం కార్యకర్తలను చంపారు. సల్వాజుడుం నాయకులనూ, క్యాంపులలో ఉన్న ఎస్పీవోలను లక్ష్యంగా చేసుకొని, ఈ దాడులు జరుగుతున్నాయి. ఎస్పీవోల విషయంలో నక్సలైట్లు చాలా క్రూరంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని సందర్భాలలో నక్సలైట్లు, ఎస్పీవోల కళ్లు పీకారనీ, మర్మాంగాలను కోసారనీ కొందరు తెలిపారు.

సల్వాజుడుం సానుభూతిపరులని భావించిన వారినీ, సల్వాజుడుంలో పనిచేస్తున్న వాళ్ల కుటుంబ సభ్యులనూ నక్సలైట్లు అపహరించారు, హింసించారు, చంపారు. క్యాంపులలో ఉంటున్నవాళ్లు – స్వచ్ఛందంగా వచ్చినా, బలవంతంగా తరలించబడ్డా మళ్లీ వెనక్కిపోతే, నక్సలైట్లు చంపుతారేమోనని భయపడుతున్నారు. సల్వాజుడుంకు సహకరిస్తున్నారనే నెపంతో చంపబడ్డ 45 మందికి సంబంధించిన సమాచారం హ్యూమన్ రైట్స్ వాచ్ దగ్గర ఉంది.

భద్రతా దళాల మీద చేసే దాడులలో నక్సలైట్లు తరుచుగా మందుపాతరలను, ఇతర ప్రేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారు. సల్వాజుడుం మొదలయినతర్వాత జూన్ 2005 నుండి ఈ దాడులు మరీ ఎక్కువయ్యాయి. జూన్ 2005–డిశెంబర్ 2007 మధ్యలో కనీసం 30 సందర్భాలలో పేలుడు పదార్థాలను పేల్చారు. కొన్నిసార్లు రిమోట్ ట్రిగ్గర్ యంత్రాలను కూడా వినియోగించారు. ఎక్కువసార్లు ఈ పేలుళ్ల లక్ష్యం భద్రతా దళాలే అయినప్పటికీ, కొన్నిసార్లు ఈ పేలుళ్లలో సాధారణ ప్రజలు మరణించారూ, గాయపడ్డారు.

పోలీసు ఆపరేషన్లలో స్కూల్ బిల్డింగులను వాడుతున్నారనే నెపంతో, ఉద్దేశపూర్వకంగా డజన్ల కొద్ది స్కూళ్లను నక్సలైట్లు ధ్వంసం చేశారు. సల్వాజుడుం ప్రారంభమయిన తర్వాత, నక్సలైట్లు ధ్వంసం చేసిన 20 స్కూళ్ల సమాచారాన్ని హ్యూమన్ రైట్స్ వాచ్ సేకరించింది.

## ముఖ్యమైన సిఫారసులు: రక్షణ, జవాబుదారీతనం తక్షణ అవసరం

నక్సలైట్లు పాల్పడుతున్న నేరాల బారిన పడకుండా ప్రజలను రక్షించడం – కేంద్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాల చట్టబద్ధ బాధ్యత. అదే విధంగా, శాంతిభద్రతలను కాపాడే ఉద్దేశ్యంతో తీసుకునే చర్యలు తప్పనిసరిగా అంతర్జాతీయ మానవహక్కుల చట్టాలకు లోబడి ఉండాలి. ఆదివాసీలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలనూ, ప్రభుత్వాలు శాంతిభద్రతల సమస్యగా చూడడం వలన ఆదివాసీ సమాజాల్లో ప్రభుత్వాల పట్ల తీవ్ర వ్యతిరేకత పేరుకపోయింది. ఈ వ్యతిరేకతే, ఆదివాసీలను, నక్సలైటు ఉద్యమాలకు మద్దతుదారులుగా మార్చింది. అంతేకాక, అంతర్జాతీయ మానవహక్కుల విధివిధాలను ప్రభుత్వాలు ఎప్పుడూ ఖాతరుచేయలేదు. ప్రభుత్వం, సల్వాజుడుం

చేస్తున్న నేరాలకు అవసరమైన సహాయం అందించడమే కాకుండా, సల్వాజుడుంను నేరవిచారణకు అతీతమైన ఒక సంస్థగా రూపొందించింది. ఈ అనాగరిక వాతావరణం గడచిన మూడు సంవత్సరాలలో లెక్కలేనన్ని మానవహక్కుల ఉల్లంఘనలకూ, హింసకూ దారితీసి ఆదివాసీ సమాజం సంక్షోభానికి గురయింది. ఈ సంక్షోభం ఫలితంగా ఆదివాసీలు వేల సంఖ్యలో విస్థాపితులయ్యారు.

అంతర్జాతీయంగా ఆమోదం పొందిన 'ఐక్యరాజ్యసమితి మార్గదర్శక సూత్రాలు – అంతర్గత విస్థాపన' (ఐరాస అంతర్గత విస్థాపనా నియమాలు) ప్రకారం విస్థాపితులు వారి స్వంత ఇంటికి లేదా స్వస్థలానికి స్వచ్ఛందంగా తిరిగి వచ్చేలా అవసరమైన పరిస్థితులను కల్పించడం, అన్నిరకాల మార్గాలను అన్వేషించడం లేదా దేశంలో మరోచోట స్వచ్ఛందంగా కుదురుకునే ఏర్పాటు చేయడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. అంతేకాకుండా వారు ఎక్కడ ఉన్నా రక్షణకు, గౌరవానికి భంగం జరగకుండా ప్రభుత్వాలే చూసుకోవాలి. అదేవిధంగా విస్థాపితులు తిరిగి కుదుటపడడానికి, అన్ని రకాల సంబంధాలను నెలకొల్పుకోవడానికి తగిన పథకాలను రూపొందించి, అభివృద్ధి చేయాలి. ఈ పథకాలను రూపొందించడంలో విస్థాపితుల సలహా, సంప్రదింపులు తప్పనిసరి.

## అంతర్జాతీయ మానవ హక్కులు నిర్దేశించిన బాధ్యతలను దృష్టిలో పెట్టుకొని:

* కేంద్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలు – సల్వాజుడుం చేపడుతున్న చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. ఆయుధాల సరఫరా, సల్వాజుడుం చేపడుతున్న అన్నిరకాల కార్యక్రమాలలోనూ, దాడులలోనూ, ప్రతీకారచర్యలలోనూ ప్రభుత్వ దళాల భాగస్వామ్యంతో సహా – అన్నిరకాల సహాయాలను తక్షణం ఆపాలి.

* మానవహక్కుల ఉల్లంఘనలకు కారణమయిన వ్యక్తులందరినీ, వారి హోదాతో నిమిత్తం లేకుండా తగురీతిలో విచారించగల ఒక స్వతంత్ర, సమర్థత గల సంస్థను ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

* కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా నడుచుకోవడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా రాజ్యాంగబద్ధంగా వ్యవహరించేలా చూసుకోవాల్సిన బాధ్యత దృష్ట్యా: బీజాపూర్, దంతెవాడ జిల్లాలలో తీవ్రమైన మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన వ్యక్తులందరినీ, పెద్ద హోదాలలో ఉన్న అధికారులతో సహా తక్షణం విచారించమని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని, కేంద్రం ఆదేశించాలి. ఒకవేళ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరినట్లయితే, కేంద్రమే ఆ పని చేస్తుందనే ఆమోదాన్ని కూడా ప్రకటించాలి.

* నక్సలైట్ వ్యతిరేక పారామిలటరీ కార్యకలాపాలలో ఎస్‌పివోలను వినియోగించడాన్ని తక్షణం నిలిపివేసే చర్యలను ఆ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలి.

* కేంద్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు– ఐరాస అంతర్గత విస్థాపనా నియమాలకు కట్టుబడి ఉండాలి, అమలయ్యేలా తగు చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా అంతర్గత విస్థాపిత వ్యక్తులపైన

తిరిగి దాడులు జరగకుండానూ, ఇంకేరకమయిన హింసకు గురికాకుండా చూడడం ప్రభుత్వాల బాధ్యత. అంతేకాకుండా, వివక్ష లేకుండా అందరికీ తినడానికి తిండి, మంచినీళ్లూ, ఆవాసం, కట్టుకోవడానికి బట్టలు, ప్రాథమిక వైద్యం తదితర సౌకర్యాలను కల్పించాలి.

* క్యాంపు నివాసులూ, దూరప్రాంతాలలో తలదాచుకున్న వారూ స్వచ్ఛంధంగా వారివారి గ్రామాలకు తిరిగి వెళ్తామని నిర్ణయించుకుంటే, వెళ్ళగలిగే పరిస్థితులను కల్పించడం, అవసరమైన ఏర్పాట్లను చేయడం – కేంద్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల బాధ్యత. లేదా దేశంలో మరోచోటనైనా జీవించే పరిస్థితిని కల్పించాలి. కొత్తగా ఏర్పడబోయే ఆవాసాలలోనూ, పాతగ్రామాలలోనూ ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలు అందరికీ అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.

* ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులు విస్థాపితుల ఆవాసాలను ధ్వంసం చేయకుండా, ఒకచోటు నుంచి మరోచోటుకు తరమకుండా, వారి ఆస్తులను జప్తు చేయకుండా ఉండేలా, కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

* పోలీసు విభాగంలోనూ, ప్రభుత్వ వ్యతిరేక సాయుధ దళాలలోనూ పనిచేస్తున్న పిల్లలను గుర్తించడం, విడుదల, పునరేకీకరణ తదితర లక్ష్యాలతో ఒక జాతీయ విధానాన్ని – ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలను సంప్రదించి తక్షణం ప్రకటించాలి. ఈ విధానం 'పారిస్ సూత్రాలకు', 'సాయుధ బలగాలు, సాయుధ గ్రూపులతో సంబంధాలు నెరపుతున్న పిల్లలకోసం మార్గదర్శకాలకు' కట్టుబడి ఉండాలి.

**సిపిఐ (మావోయిస్టు) పార్టీ తక్షణం :**

* చంపడం, బెదిరించడం, తిండీ డబ్బులు దండుకోవడం తదితర హింసను ఆపాలి; మందుపాతరలను ఇతర పేలుడు పదార్థాలను పైరులపైననే గాక ఎస్‌పివోల పైనా, సల్వాజుడుంలో పాల్గొన్న వారిపైనా, క్యాంపు నివాసులపైనా, పోలీస్ ఇన్‌ఫార్మర్ల పైనా ప్రయోగించడం ఆపాలి.

* సల్వాజుడుం క్యాంపులను వదిలి తిరిగి గ్రామాలకు వెళ్లాలనుకుంటున్న గ్రామస్తుల రక్షణను ఖాయంచేస్తూ ఒక విధానాన్ని ప్రకటించి, అమలు చేయాలి.

* 18 సంవత్సరాల లోపు వయస్సు వాళ్లను ఏ నక్సలైట్ సంఘాలల్లో చేర్చుకోవద్దు. ఇప్పటికే కొనసాగుతున్న పిల్లలందర్నీ విడుదల చేయాలి. 18 ఏళ్లు రాకముందే చేరినవారు కోరుకుంటే, ఇప్పటికైనా వెళ్లిపోయే అవకాశం ఇవ్వాలి.

## హ్యూమన్ రైట్స్ వాచ్ అవలంబించిన పద్ధతి

నవంబర్ 2007 – ఫిబ్రవరి 2008 మధ్యలో, హ్యూమన్ రైట్స్ వాచ్ – ఖమ్మం, వరంగల్ (ఆంధ్రప్రదేశ్); బిజాపూర్, దంతెవాడ, బస్తర్ (ఛత్తీస్‌గఢ్) జిల్లాలలో నిర్వహించిన పరిశోధన ఆధారంగా ఈ నివేదిక రూపొందించబడింది. నక్సలైట్ల, సల్వాజుడుం, ప్రభుత్వ దళాల మధ్య జరుగుతున్న సమరం, దాని ప్రభావం ఈ

జిల్లాలలోనే ఎక్కువ. అందుబాటులో ఉన్న సాహిత్యాన్ని పరిశీలించడం; విభిన్న వ్యక్తుల : స్వతంత్ర పరిశోధకులు, స్థానిక ఎన్‌జివోలు, విలేకరులు, ఛత్తీస్‌గఢ్ వివాదాన్ని అధ్యయనం చేసిన లేదా బాధితులకు న్యాయసహాయం అందించిన న్యాయవాదుల – ఇంటర్‌వ్యూల నేపథ్యంగా ఈ రిపోర్టు రూపొందించబడింది.

**ఈ పరిశోధనలో భాగంగా హ్యూమన్ రైట్స్ వాచ్ 235 మందిని ఇంటర్‌వ్యూ చేసింది:**

1. బిజాపూర్, దంతెవాడ జిల్లాలలోని 18 గ్రామాలనుంచి, నిర్వాసితులై ఖమ్మం, వరంగల్ జిల్లాలలోని 17 గ్రామాలల్లో తలదాచుకున్న – 69 మంది బాధితులను;
2. బిజాపూర్, దంతెవాడ జిల్లాలలో – 7 సల్వాజుడుం క్యాంపులలో, ఒక ప్రభుత్వ పక్కా గృహ సముదాయంలో నివసిస్తున్న – 71 మంది క్యాంపు నివాసులను (ఇందులో కొందరు గతంలో క్యాంపుల్లో ఉండేవారు) ఇంకా 50 మంది పౌరులను, ముగ్గురు సల్వాజుడుం నాయకులను, 18 మంది ఎస్‌పివోలను;
3. 10 మంది మాజీ నక్సలైట్లను (వీరిలో ఇద్దరు బాలల సంఘాలలో పనిచేశారు)

ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 15 మంది అధికారులను కూడా హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్‌వ్యూ చేసింది. దంతెవాడ, బిజాపూర్ జిల్లాల కలెక్టర్లను, దంతెవాడ ఎస్‌పిని, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర డిజిపిని, భద్రాచలం డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసరును, ఖమ్మం సబ్ కలెక్టరును తదితరులను ఇంటర్‌వ్యూ చేసింది.

ఇంకా న్యాయవాదులను, స్థానిక విలేకరులను, అనేక స్థానిక, అంతర్జాతీయ ఎన్‌జివోల ప్రతినిధులను, వనవాసీ చేతనాశ్రమం, పియుసిఎల్, ఫోరం ఫర్ ఫ్యాక్ట్ ఫైండింగ్, డాక్యుమెంటేషన్ అండ్ అడ్వకసీ, వన్యా, గాయత్రీ సంఘ్ పరివార్, బస్తర్ ఆదివాసీ అభివృద్ధి సంస్థ, కేర్, ఎమ్‌ఎస్‌ఎఫ్, యునిసెఫ్ తదితర సంస్థలను, వ్యక్తులను – మొత్తం 51 మందిని ఇంటర్‌వ్యూ చేసింది.

నక్సలైట్ల పేరుతో అరెస్ట్‌కాబడి జైళ్లలో ఉన్నవారిని, ప్రత్యేకించి జైళ్లలో ఉన్న పిల్లలను ప్రత్యక్షంగా ఇంటర్‌వ్యూ చేసి వారి అభిప్రాయాలను కూడా నివేదికలో చేర్చాలనుకున్నప్పటికీ, దంతెవాడ ఎస్‌పి అనుమతి ఇవ్వకపోవడం వల్ల సాధ్యం కాలేదు.

భద్రతా కారణాల రీత్యా అడవుల్లో తలదాచుకున్న, మారుమూల అడవులలో ఉన్న గ్రామాలలో నివసిస్తున్న ఆదివాసీలనూ, మావోయిస్టు పార్టీ ప్రతినిధులనూ హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్‌వ్యూ చేయలేక పోయింది. అయినప్పటికీ, ఈ వివాదంపైన పత్రికా ప్రకటనల రూపంలో వెలువర్చిన మావోయిస్టు పార్టీ అభిప్రాయాలనూ, అక్టోబర్ 2006లో స్వతంత్ర పౌర స్పందనకు (భారతీయులతో ఏర్పడిన ఒక నిజనిర్ధారణ బృందం) రాసిన ఉత్తరంలోని అంశాలను నిశితంగా పరిశీలించింది.

బాధితులకు సహాయపడుతున్న స్థానిక ఎన్‌జివోల సహకారంతో బాధితులను, ప్రత్యక్ష సాక్షులను హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూ చేయగలిగింది. ఆ తర్వాత బాధితులు ఇచ్చిన సమాచారాన్ని ఆధారం చేసుకొని, తదుపరి కలవవలసిన వ్యక్తుల లిస్ట్ తయారుచేసుకొని – ఆ ప్రకారం ఇంటర్‌వ్యూలు జరిగాయి.

ఎక్కువసార్లు, విడిగా వ్యక్తులనే ఇంటర్వ్యూ చేసేవాళ్లం, అయినప్పటికీ తరుచుగా ఆ సమయంలో వేరేవాళ్లు కూడా ఉండేవారు. ఇంటర్‌వ్యూ ఇచ్చే వ్యక్తి సౌకర్యాన్ని బట్టి హిందీ, తెలుగు, గోండి భాషలలో జరిగిన ఈ

ఇంటర్వ్యూలు గంటనుంచి మూడుగంటలపాటు కొనసాగాయి. హిందీ బాగా వచ్చేవాళ్లు హ్యూమన్ రైట్స్ వాచ్ బృందంలో వున్నారుగానీ తెలుగు, గోండిలలో మాట్లాడేవాళ్లు తారసపడినప్పుడు హ్యూమన్ రైట్స్ వాచ్ నియమించుకున్న అనువాదకుల మీద ఆధారపడి, ఇంటర్వ్యూలు జరిగాయి. కొంతమంది వాళ్ల కుటుంబం, స్నేహితులు, పరిచయస్తుల గురించి సమాచారాన్ని ఇచ్చారు. కొన్ని సందర్భాలలో అవసరాన్ని బట్టి చాలామందిని కలిపి, గుంపు ఇంటర్వ్యూలు చేయవలసి వచ్చేది.

ఇంటర్వ్యూలు జరిగిన పద్ధతిలో ఇమిడిఉన్న సమస్యల వలన – నక్సలైట్ల, సల్వాజుడుంల అఘాయిత్యాల గురించి తక్కువ మాట్లాడేవారు. నిజమో, అబద్ధమో కానీ గుర్తించబడతాం అనే భయం వాళ్లను వెంటాడుతూ ఉండేది, అందువల్ల కూడా తక్కువ మాట్లాడేవారు. వ్యతిరేకంగానే కాదు, ఒకరికి అనుకూలంగా మాట్లాడినా మరొకరితో విరోధం తెచ్చుకున్నట్టేనని భావించేవారు. చాలామంది గ్రామస్తులు ఘటనలు జరిగిన కాలాన్ని ఋతువుల్లోనో, వ్యవసాయ సీజన్లలోనో సూచించేవారు. కనీసం ఖచ్చితంగా ఆ నెలకూడా చెప్పలేకపోయేవారు. కొంతమంది పండుగలను కాలసూచికలుగా వాడుకున్నారు. కొంతమంది అది జరిగినప్పుడు వాళ్ల పిల్లలు ఏ క్లాసు చదివేవారో చెప్పేవాళ్లు. అయినప్పటికీ ఇంటర్వ్యూలలో వచ్చిన సమాచారాన్ని తరచిచూసుకొని, హ్యూమన్ రైట్స్ వాచ్ చాలా ఘటనలకు సరైన కాలాన్ని ఇవ్వగలిగింది.

ఈ రిపోర్ట్‌లో కోట్ చేసిన పౌరుల, ఎస్‌పివోల, మాజీ నక్సలైట్ల పేర్లు అసలు పేర్లు కావు లేదా అసలు పేర్లే లేవు. వారిని ఎవరూ గుర్తించకూడదనే ఉద్దేశంతో ఇలా చేశాం, ఇది హ్యూమన్ రైట్స్ వాచ్ నిబద్ధత. కానీ, ఆదివాసీ అని చెప్పినపుడు మాత్రం అదే వాస్తవం. అడిగితే, వేసుకొమ్మని చెప్పిన అధికార్ల పేర్లు మాత్రమే నివేదికలో ఉన్నాయి. కొంతమంది ఎన్‌జివోల ప్రతినిధులు వాళ్ల సంస్థగానీ, వారుగానీ గుర్తించబడకూడదని కోరుకున్నారు, అలా జరిగితే పోలీసుల, ప్రభుత్వ ఆగ్రహాన్ని చవిచూడాల్సి ఉంటుందన్నారు. వాళ్లు కోరినట్లే వారిని గుర్తించగలిగే సమాచారాన్ని తొలగించాం.

భద్రతా కారణాల రీత్యా, ఆ వ్యక్తులు కోరుకున్నట్లే ఇంటర్వ్యూ జరిగిన ప్రదేశాల పేర్లను పేర్కొనలేదు. బాధితులు ప్రతీకార చర్యలు జరగగలవని చెప్పినందువల్ల ఆంధ్రప్రదేశ్‌లోని విస్థాపితుల ఆవాసాల పేర్లుగానీ, సల్వాజుడుం క్యాంపుల పేర్లను కూడా పేర్కొనలేదు.

సమాచార హక్కు చట్టం కింద కొందరు వ్యక్తులు, ఎన్‌జివోలు – ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ అధికారుల వద్ద పొందిన సమాచారాన్ని కూడా ఈ రిపోర్టులో ఉపయోగించుకున్నాం.

ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఇంటర్వ్యూ చేయడంతోపాటు, ఈ రిపోర్ట్‌లో ప్రస్తావించిన అంశాలకు సంబంధించిన సమాచారాన్ని కోరుతూ, అదే అధికారులకు హ్యూమన్ రైట్స్ వాచ్ ఉత్తరాలు కూడా రాసింది. కానీ ఏ అధికారీ స్పందించలేదు.

### పదజాలం

హ్యూమన్ రైట్స్ వాచ్ చాలాసార్లు 'ప్రభుత్వ భద్రతా దళాలు', 'భద్రతా దళాలు' అనే పదబంధాలను వాడింది. ప్రత్యేకంగా వేరే అర్థం చెప్పనంతవరకు, ఈ పదబంధాల అర్థం ఈ ప్రాంతంలో మోహరించబడ్డ, ఒకటి, అంతకంటే ఎక్కువ భద్రతా బలగాల యూనిట్లని. జూన్ 2005 నుండి జూన్ 2008 మధ్యలో ఈ ప్రాంతంలో– సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్), ఇండియన్ రిజర్వ్ బెటాలియన్లు (ఐఆర్‌బి), ఛత్తీస్‌గఢ్

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (సిఏఎఫ్), స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (ఎస్‌పివో)లను మోహరించారు. వాటి మధ్య తేడాలను గుర్తించడం, ఒక చర్యకు ఎవరు బాధ్యులో ఖచ్చితంగా వాళ్లనే పేర్కొనడం పౌరులకు అసాధ్యం. సాధారణంగా ప్రజలు విశాల అర్థంలో 'పోలీసులు' అనేమాట వాడుతారు. ఇంటర్‌వ్యూలలో ప్రజలు తెలిపిన దాడులల్లో పాల్గొన్నది ఏ విభాగానికి చెందిన బలగాలో లేదా ఏయే విభాగాలు కలసి చేసాయో కనుక్కునే పరిస్థితి హ్యూమన్ రైట్స్ వాచ్‌కు లేకపోవడం వలన – సాధారణంగా ప్రజలు ఎలాగైతే 'పోలీసులు' అని చెబుతారో మేము దాన్ని అలాగే పాటించాం.

సల్వాజుడుం, ప్రభుత్వ భద్రతా దళాలు కలసి ప్రజలను బలవంతంగా తరలించి క్యాంపులలో పెట్టారని పైన చాలాసార్లు చెప్పుకున్నాం. కానీ అన్ని క్యాంపులను ప్రభుత్వం అధికారికంగా గుర్తించలేదు. స్థానికులు ఇలాంటి గుర్తింపులేని వాటిని కూడా క్యాంపులనే పిలిచినప్పటికీ – హ్యూమన్ రైట్స్ వాచ్ సదరు క్యాంపులకు 'అనధికార క్యాంపులనే' మాట వాడింది.

ఈ రిపోర్టులో చాలా చోట్ల వాడినట్టు బిజాపూర్, దంతెవాడ జిల్లాలు ఇప్పుడు పూర్తిగా వేరు వేరు జిల్లాలు. రెండు జిల్లాలకు కలెక్టర్లు వేరు, పాలనావిభాగాలు కూడా వేరుగా ఉన్నాయి. మే, 2007కు ముందు ఒకే పాలనా విభాగం, ఒకే కలెక్టర్ కింద – దంతెవాడ జిల్లాగా ఉండేవి. కాబట్టి, ఈ రిపోర్టులో కొన్ని సందర్భాలు అవిభాజిత దంతెవాడ జిల్లాను ఉద్దేశించినవి కూడా ఉన్నాయి. మరో ముఖ్యమైన విషయం చాలావరకు భారత నిజనిర్ధారణ కమిటీల రిపోర్టులన్నీ ఈ పరిపాలనా విభజనకు ముందు వెలువడినవే. ఆ రిపోర్టులనుండి కోట్ చేసిన దంతెవాడ అంటే అవిభాజిత దంతెవాడ అనే.

ఈ సంఘర్షణ వలన పదుల వేల సంఖ్యల్లో ప్రజలు నిర్వాసితులై కొందరు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనే ఉంటున్నారు, కొందరు పొరుగు రాష్ట్రాలకు తరలి పోయారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం, సాంకేతికంగా అందరూ 'అంతర్గత విస్థాపిత వ్యక్తులే' (ఇంటర్నల్లీ డిస్‌ప్లేస్‌డ్ పర్సన్స్) అయినప్పటికీ ఇక్కడి ప్రభుత్వ అధికారులూ, ఇతరులు కూడా ఛత్తీస్‌గఢ్ వదిలి పక్క రాష్ట్రాలకు తరలిపోయిన వాళ్లను మాత్రమే అంతర్గత విస్థాపిత వ్యక్తులుగా భావిస్తున్నారు. ఈ రిపోర్ట్‌లో కూడా, ప్రత్యేకంగా సూచించనంతవరకు, అంతర్గత విస్థాపిత వ్యక్తులు అంటే పొరుగు రాష్ట్రాలలో ఉంటున్న నిర్వాసితులనే అర్థం.

ఐరాస పిల్లల హక్కుల ఒప్పందం, 1989 – పిల్లలకు ఇచ్చిన నిర్వచనాన్నే హ్యూమన్ రైట్స్ వాచ్ పాటిస్తుంది ఈ రిపోర్ట్‌లో పిల్లల ప్రస్తావన వచ్చిన అన్ని సందర్భాలలోనూ 18 ఏళ్ల లోపు వ్యక్తులనే భావించాలి.

# సిఫారసులు

## కేంద్ర ప్రభుత్వానికి

**సల్వాజుడుంకు సహాయపడడం వెంటనే ఆపాలి భద్రతా దళాలూ సల్వాజుడుం సభ్యులు చేసిన నేరాలను పరిశోధించి తగిన విచారణ చేపట్టమని, అలాగే మాయమయిన వ్యక్తుల సమాచారాన్ని బహిర్గతపరచమని కూడా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలి.**

* కేంద్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలు – సల్వాజుడుం చేపడుతున్న చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. ఆయుధాల సరఫరా, సల్వాజుడుం చేపడుతున్న అన్నిరకాల కార్యక్రమాలలోనూ, దాడులలోనూ, ప్రతీకారచర్యలలోనూ ప్రభుత్వ దళాల భాగస్వామ్యంతో సహా – అన్నిరకాల సహాయాలను తక్షణం ఆపాలి.

* భద్రతా దళాలు భారత రాజ్యాంగానికి, అంతర్జాతీయ చట్టాలకు–కట్టుబడి వ్యవహరించేలా అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలి. విచక్షణ లేకుండా అరెస్ట్, నిర్బంధం, చిత్రహింసలు, అవమానాల నుండి పౌరుల రక్షణ కల్పించే చట్టాలను కూడా భద్రతా దళాలు గౌరవించేలా తగిన చర్యలు తీసుకోవాలి.

* కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా నడుచుకోవడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా రాజ్యాంగబద్ధంగా వ్యవహరించేలా చూసుకోవాల్సిన బాధ్యత దృష్ట్యా: బిజాపూర్, దంతెవాడ జిల్లాలలో తీవ్రమైన మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన వ్యక్తులందరినీ, పెద్ద హోదాలలో ఉన్న అధికారులతో సహా తక్షణం విచారించమని – ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని, కేంద్రం ఆదేశించాలి. ఒకవేళ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరినట్లయితే, కేంద్రమే ఆ పని చేస్తుందనే ఆమోదాన్ని కూడా ప్రకటించాలి.

* దంతెవాడ, బిజాపూర్ జిల్లాలలో జరిగిన తీవ్రమైన మానవహక్కుల ఉల్లంఘనల నేర పరిశోధన చేపట్టి, ఆ పరిశోధన ఎలా ముందుకు సాగుతున్నదీ, తద్వారా బయటపడిన విషయాలు ఏమిటీ – ఎప్పటి కప్పుడు ప్రజలకు తెలియజేస్తూ ఉండాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని ఆదేశించాలి.

* బాధితులకు, సాక్షులకు, దాడుల–ప్రతిదాడులకు సంబంధించిన సమాచారాన్ని, నేర విచారణా ప్రక్రియకు అందజేయగల వారందరికీ తగిన రక్షణ కల్పించాలి. అంతేకాక, పైన సూచించిన వ్యక్తుల రక్షణకు ఒక పథకాన్ని తయారుచేసి, తగినన్ని నిధులను కూడా కేటాయించాలి.

* సమర్థవంతంగా పనిచేయగల రాష్ట్ర మానవ హక్కుల కమీషన్ను, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం తిరిగి ఏర్పాటు చేసేలా అన్ని చర్యలు తీసుకోవాలి. నక్సలైట్లు, సల్వాజుడుం, భద్రతా దళాల మధ్య జరుగుతున్న సంఘర్షణకు సంబంధించిన అన్ని ఫిర్యాదులనూ, పరిష్కరించేలా; సాక్ష్యమివ్వమని సంబంధితులకు సమన్లు పంపే అధికారం, ఏ ఫిర్యాదు లేకున్నా తనంతట తాను నేరపరిశోధన చేపట్టే అధికారంతో సహా అన్ని అధికారాలూ ఈ కమీషన్‌కు ఉండేలా చర్యలు తీసుకోవాలి.

## విస్థాపితుల రక్షణ

* అంతర్గత విస్థాపితుల కోసం ఒక జాతీయ విధానాన్ని, పథకాన్ని అభివృద్ధి చేసి, అమలులో పెట్టాలి. ఈ విధానం – విస్థాపితులతో, ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలతో, బహుళ ప్రభుత్వ సంస్థలతో సంప్రదించి తయారు చేయాలి. అంతేకాకుండా అది ఐరాస విస్థాపనా నియమాలకు కట్టుబడి ఉండాలి. విచక్షణలేని, చట్టవ్యతిరేక విస్థాపన నుండి ఈ విధానం రక్షణ కల్పించాలి. విస్థాపితులందరూ వివక్షత లేకుండా ప్రభుత్వ సహాయాన్ని పొందే హక్కును, వెనక్కి వెళ్లాలనుకుంటున్న వారు సురక్షితంగా వెళ్లగలిగే అవకాశాన్ని, సమగ్ర పునరావాసాన్ని, విస్థాపితులను చేసే క్రమంలో నష్టపోయిన ఆస్తులకు పరిహారాన్ని తదితర హక్కులను ఈ విధానం కల్పించాలి.

ఈ లోపు,

* విస్థాపితుల ఆవాసాలను ధ్వంసం చేయవద్దనీ, బలవంతంగా తరమవద్దనీ, ఒకచోటినుండి మరోచోటికి మార్చవద్దనీ, వస్తువులను జప్తు చేయొద్దనీ – ఆంధ్రప్రదేశ్ అధికారులను ఆదేశించాలి.

* విస్థాపితుల అవసరాల కోసం రిజర్వ్ అటవీ భూములను, అటవీయేతర అవసరాలకు (నివాసంతో సహా) ఉపయోగించుకోవచ్చని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అనుమతినివ్వాలి.

* ఉపాధి హామీ, సబ్సిడీ ఆహారం, పనికి ఆహారం, సర్వతోముఖాభివృద్ధి గల జీవనానికి ప్రభుత్వం ప్రకటించిన ఇతర పథకాలతో సహా అన్ని రకాల ప్రభుత్వ పథకాలనూ, సదుపాయాలనూ విస్థాపితులకు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు అమలు చేయాలని, ఆదేశించాలి. అట్లే ఈ పథకాలను వినియోగించుకోవడానికి అవసరమైన అన్ని పత్రాలను జారీచేయమని కూడా ఆదేశించాలి.

* ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు – పునరావాస పథకాలను రూపొందించుకునే తీరును, వాటి అమలు, అవి ముందుకు సాగుతున్న తీరు మొదలగు విషయాలను పర్యవేక్షించాలి. విస్థాపితులు తిరిగి స్వంత ప్రాంతాలకు చేరడమో లేదా సమగ్ర పునరావాసాన్ని పొందడమో ఈ పర్యవేక్షణ ఉద్దేశ్యం కావాలి.

* దంతెవాడ, బిజాపూర్ జిల్లాలలో పాతిపెట్టిన మందుపాతరల తొలగింపుకు కావాల్సిన అన్నిరకాల సదుపాయాలను, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి అందజేయాలి.

## అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాల విలువలకు కట్టుబడి శాంతిభద్రతల పరిరక్షణ ఉండాలి

* పోలీస్ శిక్షణా సంస్థలలో బోధనాంశాలను సవరించాలి. శాస్త్రీయమైన, చట్టబద్ధమైన విచారణా పద్ధతులతో సహా, మానవ హక్కులకు సంబంధించిన అంశాలను కూడా బోధనాంశాలలో చేర్చాలి. అన్ని శిక్షణా కార్యక్రమాలు చట్టాలను అమలు చేసే అధికారుల కోసం ఐరాస రూపొందించిన విధాన నియమావళికి, ఇతర మానవ హక్కుల చట్టాలు నిర్దేశించిన విలువలకు కట్టుబడి ఉండాలి.

**సాయుధ సంఘర్షణల్లో పిల్లలను చేర్చుకోవడాన్ని అరికట్టాలి, అంతేకాకుండా అన్నిరకాల సాయుధ దళాలలో, బలగాలలో కొనసాగుతున్న పిల్లల పునరావాసానికి తగిన సాయం అందించాలి.**

* ఎస్‌పివోలుగా కొనసాగుతున్న 18 ఏళ్ల లోపు పిల్లలందరినీ గుర్తించి, తొలగించి – వారికి అవసరమైన ప్రత్యామ్నాయ విద్య, వృత్తి నైపుణ్యాన్ని అందించే కార్యక్రమాలు చేపట్టేలా, చర్యలు తీసుకోవాలి.
* 'ఎస్‌పివో నియామకాలకు 18 ఏళ్లు దాటినవారే అర్హులన్న' సవరణ భారత పోలీసు చట్టం, 1861లో చేర్చాలి. తద్వారా భవిష్యత్తులో ఇలాంటి నియామకాలు జరగకపోవచ్చు.
* సాయుధ గ్రూపులలో, పోలీసులలో వినియోగించబడుతున్న పిల్లల – గుర్తింపు, విడుదల, పునరేకీకరణ తదితర లక్ష్యాలతో ఒక జాతీయ విధానాన్ని అభివృద్ధి చేయాలి. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలను, బహుళ ప్రభుత్వ సంస్థలను సంప్రదించి ఈ విధానాన్ని రూపొందించాలి. ఈ విధానం 'పారిస్ సూత్రాలకు', 'సాయుధ బలగాలు, గ్రూపులకు అనుబంధంగా పనిచేస్తున్న పిల్లల కోసం మార్గదర్శకాలకు' కట్టుబడి ఉండాలి.
* పిల్లలనూ, లొంగిపోయిన పిల్లలను కూడా ఎస్‌పివోలుగా, ఇన్‌ఫార్మర్లుగా ఉపయోగించే విధానానికి స్వస్తి చెప్పే ప్రణాళికను రూపొందించాలి, అమలు చేయాలి.
* జనన మరణాల నమోదు చట్టం, 1969ని అమలు చేయాలి. పిల్లలందరికీ పుట్టుక ధృవీకరణ పత్రాలను ఇవ్వాలి.
* పోలీసు విధులను నిర్వర్తించడానికి కనీస వయస్సు 18గా ఉండే ఒక సమర్థవంతమైన విధానాన్ని రూపొందించి, అమలు చేయాలి. 18 ఏళ్ల లోపు పిల్లలను, వాళ్లు మాజీ నక్సలైట్లు అయినా సరే పోలీసు విధులలోకి తీసుకోవడం, ఇన్‌ఫార్మర్లుగా తయారు చేయడం లాంటి పనులు చేసే వ్యక్తులను శిక్షించే పాలసీని తయారుచేసి, అమలు చేయాలి.
* 'బాలకార్మికుల హీనమైన రూపాల ఒప్పందం'లో (182 వ అంతర్జాతీయ కార్మిక సంస్థ సదస్సు) భారతదేశం సభ్యురాలిగా చేరాలి. సాయుధ సంఘర్షణల్లో పిల్లల నియామకాన్ని, ఉపయోగాన్ని అత్యంత హీనమైన బాలకార్మిక రూపంగా ఈ ఒప్పందం నిర్వచించింది.

## ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వానికి

**సల్వాజుడుంకు అందుతున్న ప్రభుత్వ సహాయాన్ని తక్షణం నిలపాలి;**

**సల్వాజుడుం, పోలీసులు చేస్తున్న హింసకు ప్రభుత్వ ఆమోదాన్ని రద్దు చేసుకోవాలి; ఇకపైన హింస జరగకుండా చూసుకోవాలి.**

* సల్వాజుడుం చేస్తున్న చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలి. ఆయుధాల సరఫరా; సల్వాజుడుం చేపడుతున్న అన్ని కార్యక్రమాలలో, దాడులలో,

ప్రతీకార చర్యలలో – పోలీసుల, ఎస్‌పిఓల భాగస్వామ్యం; పోలీసుల నుండి ప్రభుత్వం నుండి సల్వాజుడుంకు అందుతున్న ఇతర అన్నిరకాల సహాయాలను – తక్షణం ఆపాలి.

* మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన వ్యక్తులపైన, వారి హోదాతో నిమిత్తం లేకుండా తగురీతిలో విచారణ చేపట్టాలి. విచారణ జరపడానికి ఒక సంస్థను ఏర్పాటు చేయాలి. అంతేగాక, జరిగిన మానవహక్కుల ఉల్లంఘనలలో – బిజాపూర్, దంతెవాడ జిల్లాల పోలీసు, పరిపాలనా పై అధికారుల పాత్ర ఉందా? లేదా హింసాత్మక ఘటనలు జరుగుతున్నప్పుడు మిన్నకుండిపోయారా? అన్న దిశగా కూడా విచారణ జరిపి బాధ్యులని తేలితే సర్వీసుల నుంచి తొలగించడం, నేర విచారణా, తగిన అన్ని చర్యలూ తీసుకోవాలి.

* దంతెవాడ, బిజాపూర్ జిల్లాలలో తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలపై పరిశోధన మొదలుపెట్టి ఆ పరిశోధన ఎలా ముందుకు సాగుతున్నదీ, పరిశోధనలో బయటపడిన విషయాలు ఏమిటి అనే సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ ఉండాలి.

* నక్సలైట్లకు వ్యతిరేకంగా జరిపే పారా మిలటరీ కార్యకలాపాలలో ఎస్‌పిఓలను వినియోగించరాదు.

* అదృశ్యమైన వ్యక్తుల వివరాలు తెలపాలి. సల్వాజుడుం క్యాంపులకు తరలించబడి, పోలీస్ స్టేషన్లలో నిర్బంధించబడి హత్యకు గురయి జాడ తెలియకుండా అదృశ్యమైన వారి వివరాలు చెప్పాలి; ఆ నిజాలను సంబంధిత కుటుంబ సభ్యులకు కూడా చెప్పాలి.

* అదృశ్యమైన వ్యక్తులకు సంబంధించిన ఒక జిల్లా స్థాయి యూనిట్‌ను స్థాపించాలి. అప్పుడు సదరు కుటుంబ సభ్యులు లేదా సంబంధీకులు ప్రతీకార దాడులు జరగవచ్చనే భయం లేకుండా అదృశ్యమైన వారి సమాచారం తెలియజేసే అవకాశం ఉంటుంది.

* విచక్షణ లేకుండా అరెస్ట్‌లు చేసే సంప్రదాయానికి స్వస్తి పలకాలి. అరెస్ట్, నిర్బంధానికి సంబంధించి సుప్రీంకోర్టు వెలువరించిన డి.కె.బసు మార్గదర్శకాలు ఖచ్చితంగా అమలు జరిగేలా చూసి; ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించిన పోలీసు అధికారులపైన క్రమశిక్షణా చర్యలు చేపట్టాలి. అంతేకాకుండా అరెస్ట్, నిర్బంధాలకు సంబంధించి ప్రజలకున్న హక్కులను విశదపరిచే ప్రచార కార్యక్రమాలను చేపట్టాలి.

* ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక ప్రజా భద్రతా చట్టం, 2005ను రద్దు చేయాలి.

* స్కూళ్లను – మిలటరీ లేదా సల్వాజుడుం కార్యక్రమాలకు ఉపయోగించకూడదు.

* విలేకరులు, సంఘర్షణను బయటి ప్రపంచానికి తెలియజేసే ప్రయత్నం చేసిన కార్యకర్తలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై ప్రచారం చేసిన వ్యక్తులు, బాధితుల తరఫున మాట్లాడిన వ్యక్తులు, ఇంకా నిజనిర్ధారణ కమిటీల సభ్యుల మీద అమలయిన హింస, వేధింపులు, బెదిరింపులు, చేయిచేసుకోవడం తదితర నేరాలను పరిశోధించి, తగు విచారణ చేపట్టాలి. మానవత్వంతో విస్థాపితులకు ఇతరేతర బాధితులకు సహాయపడుతున్న సంస్థలు స్వేచ్ఛగా, సురక్షితంగా పనిచేసే వీలును కల్పించాలి.

## నిర్వాసితుల రక్షణ, సహాయం

* గ్రామాలకు తిరిగి వచ్చినవారిపైనా, చెట్లల్లో పుట్టలల్లో తలదాచుకొని 'దొంగచాటుగా' వచ్చి వ్యవసాయం చేసుకుంటున్న వాళ్ల పైనా – పోలీసులు, ఎస్‌పివోలు, సల్వాజుడుం సభ్యులు మరోదాడి చేయకుండా నియంత్రించే అన్నిరకాల ఏర్పాట్లను ప్రభుత్వం చేపట్టాలి.

* ఐరాస విస్థాపనా నియమాలననుసరించి నిర్వాసితుల మీద దాడి జరగకుండా, ఇతర రూపాల హింస అమలు కాకుండా చూడాలి. అంతేకాకుండా వివక్షత లేకుండా నిర్వాసితులందరికీ ఆహారం, మంచినీళ్లు, ఆశ్రయం, బట్టలు, ప్రాథమిక వైద్యం, పరిశుభ్రమైన వాతావరణం తదితర సదుపాయాలను కల్పించాలి.

* సిద్ధపడిన గ్రామస్తులందరూ, గ్రామాలకు తిరిగి రావడానికి కావల్సిన పరిస్థితులను కల్పించే ఒక రాష్ట్ర స్థాయి ప్రణాళికా కమిటీని ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ, ప్రభుత్వేతర, బహుళ ప్రభుత్వ ప్రతినిధులు, ఈ విషయంలో నిపుణులు అంతేకాకుండా ఖాళీ చేయించబడిన గ్రామాల పంచాయితీ సభ్యులు, ఆదివాసీ పెద్దలు – సభ్యులుగా, ఈ కమిటీని రూపొందించాలి. ఈ కమిటీ నిర్వాసితులందరూ సురక్షితంగా, గౌరవంగా ఆయా గ్రామాలకు తిరిగి వచ్చి, వారి వారి జీవనోపాధిని చేపట్టే ఒక ప్రణాళికను అభివృద్ధి చేయాలి. ఈ వెనక్కి వచ్చే కార్యక్రమమంతా ఐరాస విస్థాపనా నియమాలకు అనుగుణంగా ఉండడమే కాకుండా అంతర్గత విస్థాపక సమూహాల హక్కులను గౌరవించేదిగా ఉండాలి.

* గ్రామాలలో మౌలిక సదుపాయాల పునరుద్ధరణ జరగాలి. కనీసం విధ్వంసానికి ముందు ఉండిన సదుపాయాలన్నా ప్రభుత్వ ఖర్చుతో కల్పించాలి.

* ఎన్‌జివోలు, సామాజిక కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, నిర్వాసిత వ్యక్తులతో కూడిన ఒక జిల్లా స్థాయి బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఈ బృందం క్యాంపులను, ఇతర ప్రదేశాలను సందర్శించి గ్రామాలకు తిరిగి రావాలనుకుంటున్న నిర్వాసితుల సర్వే చేపట్టాలి. నిర్వాసితుల పేర్లు, ఆయా గ్రామాల పేర్లు, అంతేగాక విస్థాపన కాలంలో ఆ కుటుంబానికి జరిగిన అన్ని రకాల నష్టాలను కూడా సర్వేలో నమోదు చేయాలి.

* జూన్ 2008 వరకు క్యాంపులలోనూ, బిజాపూర్, దంతెవాడ జిల్లాలోని ఇతర ప్రదేశాలలో ఉంటున్న నిర్వాసితుల పూర్తి సమాచారాన్ని, నిర్వాసితుల సంఖ్యతో బాటు విడుదల చేయాలి.

* మారుమూల గ్రామాలకు చెందిన నిర్వాసితులు ఏవైనా కారణాల వల్ల (భద్రత, ఇత్యాది) తిరిగి రావడానికి సిద్ధపడకపోతే వారికి తగిన నష్ట పరిహారంతో పాటు విస్థాపిత వ్యక్తుల భృతిని కల్పించాలి. ఇంకా, విద్య, వైద్య, ఉపాధి తదితర సదుపాయాలను అందుబాటులోకి తేవాలి.

* అనధికారిక క్యాంపులలో, ప్రభుత్వ పక్కా గృహ సముదాయాలలో ఉంటున్న నిర్వాసితులకు కూడా అన్ని రకాల ప్రభుత్వ సదుపాయాలు, సేవలు అందేలా చూడాలి.

**బాల ఎస్పిఓల నియామకాన్ని ఆపాలి, కొనసాగుతున్న వారిని గుర్తించి, పునరావాసం కల్పించాలి**

* 18 ఏళ్ల లోపు ఉండే ఎస్పిఓలను గుర్తించి, సర్వీసులనుండి తొలగించి, వృత్తి విద్యా నైపుణ్యాన్ని నేర్పడం లేదా ప్రత్యామ్నాయ విద్యను అందించడంతో సహా అన్ని రకాల ఇతర సహాయాలను వారికి అందించాలి.
* 18 ఏళ్లు రాకముందే చేరిన ఎస్పిఓలు కోరుకుంటే సగౌరవంగా వారిని పంపే ఏర్పాటు చేయాలి. అలాంటి వారందరికీ కోరుకున్న వృత్తి విద్యా శిక్షణను ఇవ్వాలి.
* 18 ఏళ్ల లోపు ఉన్న మాజీ నక్సలైట్లను ఎస్పిఓలుగా, ఇన్ఫార్మర్లుగా వినియోగించకూడదు.
* జనన మరణాల నమోదు చట్టం, 1969ని అమలు చేయాలి. పిల్లలందరికీ ధృవీకరణ పత్రాలు అందజేయాలి.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి

* ఆంధ్రప్రదేశ్లో అమలవుతున్న అన్ని ప్రభుత్వ పథకాలనూ అంతర్గత విస్థాపిత వ్యక్తులకు కూడా అమలు చేయాలి. అంతేకాకుండా సదరు పథకాలను వినియోగించుకునేందుకు అవసరమైన జాబ్ కార్డులను, రేషన్ కార్డులను, ఓటర్ గుర్తింపు కార్డులను తదితర అన్ని పత్రాలను జారీ చేయాలి.
* నిర్వాసితుల ఆవాసాలను ధ్వంసం చేయడం, బలప్రయోగంతో తరమడం, మరో చోటికి బలవంతంగా మార్చడం, వస్తువులను జప్తు చేయడం తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని అటవీ శాఖను ఆదేశించాలి.
* నిర్వాసితులకు అవసరమైన సహకారాన్ని అందించమని ఖమ్మం, వరంగల్ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయితీలకు సూచించాలి. అంతేకాకుండా నిర్వాసితుల వారి గుర్తింపు, వారికి జరిగిన అన్యాయం తదితర వాస్తవాలను వెల్లడించినా వారికే విధమైన హాని జరగదని హామీ ఇవ్వాలి.
* స్థానిక ఆదివాసీలు, నిర్వాసితులను వేధించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలి. అలాంటి సంఘటనలు ఏవైనా దృష్టికి వస్తే తగు చర్యలు తీసుకోవాలి.
* ప్రభుత్వ అధికారులు ఎవరైనా స్థానిక ఆదివాసీలను, నిర్వాసితులపైకి ఉసిగొల్పితే అలాంటి వారిపై చట్టప్రకారం చర్య తీసుకోవాలి.
* నిర్వాసితుల మీద, సల్వాజుడుం దాడి జరగకుండా తగిన రక్షణ కల్పించాలి.

## సిపిఐ (మావోయిస్టు) పార్టీకి

* అన్ని రకాల మానవహక్కుల ఉల్లంఘనలకు తక్షణం స్వస్తి చెప్పాలి. యుద్ధ న్యాయానికి విరుద్ధంగా జరుగుతున్న – పౌరులను హత్యచేయడం, బెదిరించడం, డబ్బులు వసూలుచేయడం; విచక్షణా

రహితంగా మందుపాతరలను వినియోగించడం; పోలీస్ ఇన్‌ఫార్మర్లను, ఎస్‌పిఓలను, సల్వాజుడుం వారిని చంపడం, గాయపర్చడం లాంటి చర్యలను తక్షణం నిలపాలి.

* స్కూళ్లను ధ్వంసం చేయడం, బాంబులతో పేల్చడం వెంటనే ఆపాలి.

* అంతర్జాతీయ మానవహక్కుల చట్టాలు ప్రతిపాదించిన విలువలను, అంతర్జాతీయ మానవతావాద చట్టాలను గౌరవించాలి, ఆచరించాలి.

* అంతర్జాతీయంగా ఆమోదం పొందిన నిష్పాక్షిక విచారణా (ఫెయిర్ ట్రయల్) ప్రమాణాలకు ఎంత మాత్రం దగ్గరగా లేని 'ప్రజా కోర్టుల'ను తక్షణం రద్దు చేయాలి. ఇన్‌ఫార్మర్లని లేదా పార్టీకి నష్టం చేశారని ఆరోపించి వ్యక్తులను కొట్టడం, చంపడం తదితర చర్యలను ఆపాలి.

* ఉద్దేశపూర్వకంగా, పౌరులను లక్ష్యంగా చేసుకొని దాడులను చేయవద్దు. ప్రాణానికే గాక వ్యక్తిగత, సామాజిక ఆస్తులకు కూడా నష్టం కలిగించవద్దు.

* సల్వాజుడుం క్యాంపులను వదిలి తిరిగి గ్రామాలకు వెళ్లాలనుకుంటున్న వారి రక్షణను ఖాయం చేస్తూ ఒక విధానాన్ని ప్రకటించి, అమలు చేయాలి.

* 18 ఏళ్ల లోపు పిల్లలను బాలల సంఘాలతో సహా ఇతర ఏ సంఘంలోకి చేర్చుకోరాదు.

* పార్టీలో కొనసాగుతున్న 18 ఏళ్ల లోపు పిల్లలందరినీ విడుదల చేయాలి. 18 ఏళ్లు రాకముందే చేరినవారు కోరుకుంటే, వెనక్కి వెళ్లే అవకాశం కల్పించాలి.

* 18 ఏళ్ల లోపు వ్యక్తులను పార్టీలో చేర్చుకోబోమని బహిరంగ ప్రకటన చేయాలి.

* నక్సలైట్ పార్టీల కమాండర్లు, ఇతరులు – 18 ఏళ్ల లోపు వాళ్ళను చేర్చుకోకుండా, తగిన చర్యలు తీసుకోవాలి. ఈ చేరికలకు "స్వచ్ఛందంగా" కూడా మినహాయింపు కారాదు. ఇలాంటి నియామకాలకు బాధ్యులయిన వారిపైన చర్యలు తీసుకోవాలి, సదరు చర్యలకు సంబంధించిన రిపోర్ట్‌లను అంతర్జాతీయ సమాజానికి కూడా అందజేయాలి.

* నక్సలైట్ దళాలలో పనిచేస్తున్న పిల్లల కోసం పునరావాస, పునరేకీకరణ కార్యక్రమాలను చేపడుతున్న యునిసెఫ్, తదితర సంస్థలకు సహకరించాలి.

* నక్సలైట్ దళాలను వదిలి వస్తున్న వారిపైననే కాకుండా వారి కుటుంబ సభ్యుల మీద జరుగుతున్న దాడులను తక్షణం ఆపాలి.

## విదేశీ ప్రభుత్వాలకు, బహుళ ప్రభుత్వ సంస్థలకు, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలకు

* సల్వాజుడుంకు అందజేస్తున్న అన్ని రకాల సహాయాలను నిలపమని – భారత కేంద్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాలకు, బహిరంగంగానూ, వ్యక్తిగతంగానూ సూచించాలి. విచక్షణారహితమైన అరెస్ట్‌లనూ, చిత్రహింసలనూ ఆపమనీ, జరిగిన మానవహక్కుల ఉల్లంఘనల బాధ్యులను తగిన విధంగా

విచారించమని అడగాలి.

* విద్యా, వైద్య సదుపాయాల కల్పనకు కేటాయించబడిన నిధులను – ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని నిర్వాసితులకు సదరు సదుపాయాలను కల్పించడానికి ఖర్చుచేయమని, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని ప్రోత్సహించాలి. వివక్షత లేకుండా నిర్వాసితులందరికీ ఈ సదుపాయాలను కల్పించాలనీ, అవసరమైతే నిధులను ఇంకా పెంచుకోవాలని కూడా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని కోరాలి.

* కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాలకు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసులకు అవసరమైన మానవహక్కుల శిక్షణా కార్యక్రమాలు జరగడానికి, తగిన సహాయం చేయాలి.

# నివేదికలోని కొన్ని భాగాలు

ఛత్తీస్‌గఢ్ నుండి పెద్ద ఎత్తున జనం పొరుగు రాష్ట్రాలకు తరలి పోవడం (ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌కి), జనాన్ని బలవంతంగా క్యాంపులలోకి తరలించడం మొదలై మూడేళ్లు గడిచిపోయాయి. అయినా ఇంతవరకూ అటు భారత కేంద్ర ప్రభుత్వంగానీ, ఇటు ఛత్తీస్‌గఢ్, ఆంధ్రద్రేశ్ రాష్ట్ర ప్రభుత్వాలుగానీ నిర్వాసిత ప్రజల రక్షణ, సహాయాలకోసం ఓ విధానాన్ని రూపొందించలేదు. నిర్వాసిత ప్రజలకు సంబంధించి ఒక జాతీయ విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాధికారులు అంటారు.[178] అలాంటి విధానమేదీ లేదు కాబట్టి నిర్వాసిత ప్రజలకు రక్షణ కల్పించి, సహాయాన్ని అందించడానికి సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో తాము అశక్తులమని కూడా వాళ్లు అంటారు.[179] ఈ విషయంలో ఓ జాతీయ విధానం తప్పనిసరిగా అవసరమే. అలా అని జాతీయ విధానం లేదన్న సాకును చూపి నిర్వాసిత ప్రజలకు రక్షణను కల్పించి, సహాయాన్ని అందించాల్సిన బాధ్యతలనుంచి రాష్ట్ర ప్రభుత్వాలు తప్పించుకోలేవు.

ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల అంతర్జాతీయ ఒప్పందం (ఐసిఇఎస్‌సిఆర్) పైన భారత దేశంకూడా సంతకం చేసింది. కాబట్టి "ప్రతీ మనిషి, తనకు, తన కుటుంబానికి అవసరమైనంత తిండి, బట్ట, గృహవసతులతో కూడిన తగిన జీవన ప్రమాణాన్ని కలిగివుండే హక్కు, జీవన పరిస్థితులను నిరంతరం మెరుగు పరుచుకునే హక్కు"[180] వుందని గుర్తించాల్సిన బాధ్యత భారత ప్రభుత్వానికి వుంది. "జాతి, వర్ణ, లింగ, భాష, మత ప్రాతిపదికన గానీ, రాజకీయ, యితర అభిప్రాయాలు, జాతీయత, సామాజిక మూలం, ఆస్తి, పుట్టుక, మరే యితర హోదా ప్రాతిపదికనగానీ వివక్ష చూపకుండా వ్యక్తులందరి హక్కులను"[181] ప్రభుత్వాలు గుర్తించాలని ఐసిఇఎస్‌సిఆర్ నిర్దేశిస్తున్నది.

ఐరాస అంతర్గత విస్థాపనా నియమాల[182] ప్రకారం, నిర్వాసితులైనవారికి వారికి దేశంలో ఏ ప్రాంతంలోనైనా రక్షణను కోరే హక్కూ, నివాసాన్ని ఎంచుకునే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలూ వున్నాయి. తమను బలవంతంగా వెనకకు పంపడానికి వ్యతిరేకంగా లేదా తమ జీవితానికి, భద్రతకు, స్వేచ్ఛకు, లేదా ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశమున్న ఏ ప్రాంతానికైనా పంపడానికి వ్యతిరేకంగా రక్షణను కోరే హక్కు ఉంది.[183] ప్రభుత్వం, నిర్వాసితులయిన వ్యక్తులకు సంబంధించిన వస్తువులను స్వాధీనం చేసుకోకూడదు. జరిమానా పేరుతో వారి ఆస్తిని నాశనం చేయడంగానీ లేదా స్వాధీనం చేసుకోడంగానీ చేయకూడదు.[184] ప్రభుత్వాలు, నిర్వాసితులయ్యే ప్రజలకు, వారిని ఎందుకు నిర్వాసితులను గావించవలసి వస్తున్నదో ఆ కారణాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందజెయ్యాలి. ఆ క్రమాన్ని నియంత్రించే విధివిధానాలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని అందించాలి. వారిని పంపేచోట వారికి తాము అందుబాటులో వుంచే సదుపాయాలేమిటనే దానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించాలి. ఒకవేళ వారికి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటే దానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని కూడా అందించాలి.[185] అంతేకాదు. ప్రభుత్వాలు, జనాన్ని నిర్వాసితులను గావించే సందర్భాలలో ఆ క్రమానికి సంబంధించిన నిర్ణయాలను తీసుకునే ప్రక్రియలో నిర్వాసితులయ్యే ప్రజలను, ప్రత్యేకించి స్త్రీలను ఆచరణ సాధ్యమైన మేరకు భాగస్వాములను

చేయాలి.[186]

నిర్వాసితులకు తగు స్థాయి జీవన ప్రమాణాన్ని కోరే హక్కు కూడా ఉంది. నిత్యావసరాలైన ఆహారమూ, తాగునీరూ, మౌలిక వసతీ గృహసదుపాయమూ, సముచితమైన దుస్తులూ, అవసరమైన వైద్యసేవలూ పారిశుద్ధ్య సదుపాయాలూ అందుబాటులో ఉండాలి. సంబంధిత అధికారులు నిర్వాసితులకు ఇవన్నీ సురక్షితంగా అందుబాటులో ఉండేలా చూడాలి.[187] నిర్వాసితులపట్ల వారు నిర్వాసితులన్న కారణంతో ప్రభుత్వాలు వివక్ష చూపడానికి వీలులేదు. నిర్వాసితులకు అన్ని స్థాయిలలోని ప్రజా వ్యవహారాలన్నిటిలోనూ పూర్తిగానూ సమాన హోదాలోనూ పాల్గొనడానికీ, ప్రభుత్వ రంగం అందించే సేవలను ఉపయోగించుకోడానికీ సమాన హక్కు ఉంది.[188] నిర్వాసితుల సంక్షేమానికి సంబంధించిన ప్రధాన బాధ్యత ప్రభుత్వాలదే. అయితే అంతర్జాతీయ మానవతావాద సంస్థలు స్వేచ్ఛగా పనిచేయడానికి తగిన పరిస్థితులు కూడా కల్పించాలి.[189]

నిర్వాసితులు స్వచ్ఛందంగా సురక్షితంగా తమ ఇళ్లకు లేదా తమ స్థిర నివాస ప్రాంతాలకు తిరిగి పోవడానికీ లేదా స్వచ్ఛందంగా దేశంలోని ఇతర ప్రాంతాలకు పోయి స్థిరపడడానికీ కావాల్సిన పరిస్థితులనూ సాధనాలనూ సమకూర్చవలసిన బాధ్యత ప్రధానంగా ప్రభుత్వ అధికార సంస్థలదే. నిర్వాసితులు ఇలా తిరిగి పోవడానికి సంబంధించిన ప్రణాళికలను రూపొందించడంలోనూ వాటి నిర్వహణలోనూ వారిని భాగస్వాములను చేయాలి.[190] దీనికి తోడు, ప్రభుత్వ సంస్థలు నిర్వాసితులు తమ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోడానికి సహాయాన్ని అందించాలి. అది సాధ్యంకానప్పుడు తగు నష్టపరిహారాన్నో లేక మరేదైనా రూపంలోని న్యాయమైన పరిహారాన్నో అందించడానికి తోడ్పడాలి.[191]

## "ముందునుయ్యి వెనుకగొయ్యి": నిర్వాసిత ప్రజలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాధికారుల దురాగతాలు

ఈ సంఘర్షణ నుండి తప్పించుకోవడం కోసం వేలాదిమంది ప్రజలు ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ, బిజాపూర్ జిల్లాలనుండి పారిపోయారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రిజర్వు ఫారెస్టు ప్రాంతాలలో తలదాచుకున్నారు. జూన్ 2005 నుండి ఇంతవరకు దాదాపు 30,000–50,000 మంది నిర్వాసితులు ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం, వరంగల్ జిల్లాలలో నివాసమేర్పరచుకున్నారని ఎన్‌జిఓల, ప్రభుత్వాధికారుల అంచనా.[262] ఆదివాసీ వ్యవహారాల నిపుణుడైన ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఒకరు ఈ విషయాన్ని ఇలా వివరించారు: "అంతర్గత నిర్వాసితులు బాగా భయపడిపోయారు. మారుపేర్లతో నివసిస్తున్నారు. అసలు తామెవరో కూడా చెప్పడానికి ఇష్టపడడం లేదు. కాబట్టి వారి గురించి స్పష్టమైన అంచనాలు లభించడం చాలా కష్టం."[263]

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంనుండి వచ్చిన నిర్వాసితులు ఏ పరిస్థితులలో రిజర్వు ఫారెస్టు ప్రాంతాలలో స్థిరపడ్డారో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తెలుసు. అయినాగానీ చట్టవిరుద్ధంగా, బలవంతంగా పదే పదే నిర్వాసితులను ఆ అటవీ ప్రాంతాలనుండి తొలగించింది. వారికి సహాయాన్ని అందించడంలో విఫలమైంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉంటున్న నిర్వాసితుల దుస్థితిని ఒక సీనియరు అటవీశాఖ అధికారి నిర్మొహమాటంగా ఇలా క్లుప్తీకరించారు:

వాళ్ళు తమ సొంత దేశంలోనే శరణార్థులు... వారికి మద్దతునిచ్చేవారు ఎవరూ లేరు. పోలీసులకూ వాళ్ళంటే [అంతర్గత నిర్వాసితులు] భయమే—వాళ్ళిక్కడ స్థిరపడితే ఇది మరో ఛత్తీస్‌గఢ్ అవుతుందన్న భయం. పోలీసు శాఖ వారికి మద్దతు ఇవ్వదు. అటవీశాఖ వారికి మద్దతు ఇవ్వదు. రెవిన్యూ శాఖ వారికి మద్దతు ఇవ్వదు.... మానవ హక్కుల కోణం నుండి చూస్తే వారి జీవితం అత్యంత దయనీయమైనది.[264]

దేశీయ చట్టాన్ని ఉల్లంఘించి లేదా అంతర్జాతీయ మానవహక్కులను ఉల్లంఘించి జరిపే బలవంతపు తొలగింపు చట్టవిరుద్ధమైన తొలగింపు అవుతుంది.[265] ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులకు సంబంధించిన అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం తగిన గృహవసతిని కలిగివుండే హక్కు ప్రతి ఒక్కరికీ వుంది. బలవంతంగా తొలగించడానికి వీలు లేదనే హక్కును ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల కమిటీ వ్యాఖ్యానిస్తూ ఇలా పేర్కొంది:

1. తొలగింపులను చేపట్టడానికి ముందే, అధికారులు బలప్రయోగాన్ని చేయవలసిన అవసరాన్ని నివారించడానికి లేదా కనీసానికి తగ్గించడానికిగానూ తొలగింపుకు గురయ్యేవారితో చర్చించి ఆచరణ సాధ్యమైన అన్ని ప్రత్యామ్నాయాలను అన్వేషించాలి;[266]
2. సమంజసత్వం, అనుగుణ్యత అనే సాధారణ సూత్రాలననుసరించి తొలగింపును చేపట్టాలి. తొలగింపుకు గురయ్యేవారిని నిరాశ్రయులను చేయకూడదు లేదా వారు మరే మానవ హక్కుల ఉల్లంఘనకు గురి కాకూడదు;[267]
3. తొలగింపు జరిగే సందర్భంగా, అధికారులు “తగిన” ప్రత్యామ్నాయ గృహవసతిని లేదా పునరావాస ప్రత్యామ్నాయాలను అందించడానికి చర్యలు తీసుకోవాలి;[268]
4. బలవంతపు తొలగింపుల వలన ప్రభావితులయ్యే వారందరికీ దానివలన ప్రభావితమయ్యే ఏ ఆస్తికైనాగాని తగిన పరిహారం పొందే హక్కు ఉంది.[269]

విధివిధాన సంబంధమైన, అవసరమైన క్రమానికి సంబంధించిన రక్షణ చర్యలను కూడా అది ఈ కింది విధంగా పేర్కొంది:[270]

1. తొలగింపుకు గురయ్యేవారితో సంప్రతింపులు జరపటానికి నిజమైన అవకాశం;
2. తొలగింపు జరిగే నిర్ణీత తేదీకి ముందు తగినటువంటి హేతుబద్ధమైన హెచ్చరిక;
3. ప్రతిపాదిస్తున్న తొలగింపులకు సంబంధించిన సమాచారం;
4. తొలగింపులు జరిగే క్రమంలో ప్రభుత్వాధికారులను భాగస్వాములను చేయడం;
5. తొలగింపులను చేపట్టే వ్యక్తులను సక్రమంగా గుర్తించడం;

6. ప్రత్యేకించి వాతావరణం బాగాలేనప్పుడుగానీ లేదా రాత్రివేళల్లోగానీ అంగీకారం లేకుండా తొలగింపులు జరపరాదు;

7. చట్టబద్ధమైన పరిష్కారాలకు అవకాశం;

8. న్యాయస్థానాల నుండి పరిష్కారాన్ని కోరుకునేవారికి చట్టపరమైన సహాయానికి అవకాశం.

## నిర్వాసితులను చట్టవిరుద్ధంగా బలవంతంగా తొలగించడం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అటవీశాఖ అంతర్గత నిర్వాసితుల గూడాలను ధ్వంసం చేయడానికి నాయకత్వం వహించింది. కాలిన మొద్దులు ఆ విధ్వంస కాండకు మూగసాక్షులుగా నిలిచాయి. స్థానిక ఎన్‌జిఓ కార్యకర్తలు, హ్యూమన్ రైట్స్ వాచ్ పరిశోధకులకు ఒక నిర్వాసిత గూడాన్ని చూపించారు. అక్కడ నిర్వాసితులు తిరిగి కొత్తగా గుడిసెలు వేసుకుంటున్నారు. "ఇక వాళ్ళిప్పుడు కట్టెలు కొట్టుకోడానికి లేదు. కాబట్టి కాలిన మొద్దులతోనే మళ్లీ గుడిసెలు వేసుకోడం మొదలెట్టారు," అని ఒక కార్యకర్త వివరించారు.[271]

నిర్వాసితుల గూడాలు చట్టవిరుద్ధమైనవని భద్రాచలం డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టాన్ని అనుసరించి చట్టవిరుద్ధమైన గూడాలను ధ్వంసం చేసే అధికారం అటవీ శాఖకు ఉందని కూడా ఆయన చెప్పారు. అయితే, ఆ డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్‌తోసహా అధికారులంతా అటవీశాఖ అధికారులు "గుడిసెలు తగలబెట్టరు," అని చెప్పారు. నిర్వాసితుల గూడాలను తగలబెడుతూ వచ్చింది స్థానిక ఆదివాసీ ప్రజలేనని వారు వివరించారు.[272]

హ్యూమన్ రైట్స్ వాచ్ ఖమ్మం, వరంగల్ జిల్లాలలోని 17 నిర్వాసిత గూడాలను సందర్శించింది. వీటిలో 9 గూడాలలోని నిర్వాసితులు అటవీశాఖ అధికారులు పదే పదే తమ గూడాలను దగ్ధం చేశారని చెప్పారు. గుడిసెలను దగ్ధం చేసేటప్పుడు వాటిల్లే నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించుకోడానికని తాము ఎంతగా వేడుకున్నాగాని వారు వినలేదనీ, తమ వ్యక్తిగతమైన వస్తువులన్నిటినీ నాశనం చేశారనీ చెప్పారు. గూడెంలో నివసించేవారినీ (పిల్లలతో సహా) కొట్టారు. లేదంటే ముందుగా సంప్రదించకుండానే, ప్రత్యామ్నాయంగా తగిన గృహ వసతిని చూపించకుండానే వారిని ఇతర ప్రాంతాలకు బలవంతంగా తరలించారు.[273] కొన్ని సందర్భాలలో అటవీశాఖ అధికారులు నిర్వాసితులను వేధింపులకు గురిచేయమని స్థానిక ఆదివాసీ ప్రజలను రెచ్చగొట్టారని చెప్పారు. ఈ ప్రభుత్వ చర్యలు, 2005 జూన్–2007 ఆగస్టు మధ్యకాలంలో 9 గూడాలకు చెందిన 700 మంది నిర్వాసితులను పదే పదే నిరాశ్రయులను గావించాయనడానికి హ్యూమన్ రైట్స్ వాచ్ వద్ద ఆధారాలున్నాయి.[274]

కొత్తూరులోని ఒక నిర్వాసితుడు తమ గూడాన్ని 2007 జనవరి నుండి 8 లేదా 9 సార్లు తగలబెట్టారని చెప్పాడు. అతనిలా అన్నాడు:

> 2007 జనవరిలో మొదటిసారి మా గ్రామాన్ని తగులబెట్టారు. [స్థానిక] గ్రామస్థులతో పాటూ అటవీశాఖ అధికారులుకూడా వచ్చి మా గుడిసెలను తగలబెట్టారు. దాదాపు

> 10 మంది అటవీ శాఖ వాళ్లూ 40 మంది గ్రామస్థులూ వచ్చి ప్రతి ఒక్కరినీ, పిల్లలనూ స్త్రీలనూ సైతం కొట్టారు.... ఇలా వాళ్ళు 8 లేదా 9 సార్లు వచ్చారు. ప్రతిసారీ గ్రామస్థులతోపాటూ అటవీ శాఖ వాళ్లు కూడా వచ్చి ప్రతిదాన్నీ తగలబెట్టేస్తారు. అటవీశాఖ వాళ్ళు జీపులలోనూ, మోటారుసైకిళ్ళమీదా వస్తారు. గ్రామస్థులు కాలినడకన వస్తారు. కొన్నిసార్లు వాళ్ళే [అధికారులు] ఆ పని చేస్తారు[తగలబెట్టడం]. కొన్నిసార్లు గ్రామస్థులకు ఏంచెయ్యాలో చెప్పి వెనక నిలబడి చూస్తారు. "పోయి వాళ్ళ గుడిసెలు తగలబెట్టండి" అని చెప్పి నిలబడి చూస్తారు.[275]

ఈ 17 నిర్వాసిత గూడాలలోని మూడు గూడాలలోని గ్రామస్థులు మాత్రమే స్థానిక ఆదివాసీ ప్రజలకు నిర్వాసిత ప్రజలకు మధ్య ద్వేషం ఉందని చెప్పారు. ఈ మూడు గూడాలలోనూ జరిగిన హింసాకాండలో స్థానిక ఆదివాసీ ప్రజలు పాల్గొన్నది నిజమేగానీ, అటవీశాఖ కూడా అందులో పాల్గొంది.[276]

కొన్ని సందర్భాలలో నిర్వాసిత ప్రజలు కొత్తగా గుడిసెలు వేసుకోడానికి స్థానిక ఆదివాసీ ప్రజలు చురుగ్గా సహాయాన్ని అందించారు. తమ గూడెం తగలబడిపోయిన ఒక నిర్వాసితుడు ఇలా చెప్పాడు, "ఆ తర్వాత [తగలబెట్టిన తర్వాత] స్థానిక గ్రామస్థులు మాకు సహాయాన్ని అందించారు. వచ్చి ఇక్కడ ఉండమని—తమతోపాటు ఇక్కడికే వచ్చి ఉండమని చెప్పారు. కాబట్టే మేము ఇప్పుడు స్థానిక గ్రామస్థుల గుడిసెల మధ్య మా గుడిసెలు వేసుకున్నాం. అయితే దేని కోసమైనా అడవికిపోతే అక్కడ మమ్మల్ని పట్టుకొని బాదుతారు."[278]

ఒక సందర్భంలో, తమకు స్థానిక గ్రామస్థుల మద్దతు ఉన్నప్పటికీ అటవీ, ఎక్సైజ్ అధికారులు తమ గూడాన్ని నాశనం చేశారని వరంగల్ జిల్లాలోని ఓ నిర్వాసితుడు చెప్పాడు:

> [ఛత్తీస్‌గఢ్ నుండి] మేము [ఆంధ్రప్రదేశ్‌లోని] బూటారం గ్రామానికి వచ్చాం.... గుడిసెలు వేసుకున్నాం. మూడు నెలల తర్వాత అటవీ, ఎక్సైజ్ అధికారులు వచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో సమస్య వున్నందున మేము ఇక్కడకు వచ్చామని వాళ్లకు తెలుసని చెప్పారు. ఇక్కడ ఉండడానికి వీల్లేదన్నారు. గ్రామపెద్దలు మమ్మల్ని ఇక్కడ ఉండడానికి అనుమతించారని మేము వాళ్లకు చెప్పాం. గ్రామపెద్దల అనుమతి పనికిరాదని అన్నారు.... మా గుడిసెలన్నీ తగలబెట్టేశారు.[279]

నిర్వాసితులను తొలగించే ప్రయత్నాల్లో అటవీశాఖ అధికారులు నిర్వాసిత గూడాలను మాత్రమేకాదు, వారికి సంబంధించిన అన్ని వస్తువులనూ తగలబెట్టేశారు. అలాచేస్తే వారికి ఏగతి పడుతుందనే పట్టింపే చూపలేదు. తమ డబ్బుతో పాటూ ఆహారధాన్యాలను కూడా తగలబెట్టేయడంతో ఆకలికి ఎలా మాడవలసి వచ్చిందో కొత్తూరుకు చెందిన ఓ నిర్వాసితుడు హ్యూమన్ రైట్స్ వాచ్‌కి వర్ణించాడు:

> ఓ గ్రామస్థుడు దాచుకున్న 5,000 రూపాయలను కూడా తగల బెట్టేశారు. వాళ్ళు

> మాకున్నవన్నీ తగలబెట్టేయబోతుంటే, మా తిండిగింజలనూ, డబ్బులనైనా తెచ్చుకోడానికి అనుమతించమని ప్రాధేయపడ్డాం. కానీ వాళ్ళు మమ్మల్ని ఇంకా కొట్టారు. మా సమస్తాన్నీ తగలబెట్టేశారు. మా కోళ్లనూ మేకలనూ పశువులనూ తీసుకుపోయారు కూడా.... మేం ఎక్కడికి పోడానికీ లేదు. కాబట్టి మా గుడిసెలు కాలబెట్టిన ప్రతిసారీ ఇక్కడి చెట్లకిందనే తలదాచుకుంటాం. ఒకసారి వాళ్ళు వర్షాకాలంలో వచ్చారు. సహాయం కోసం దగ్గర్లో ఎక్కడికైనా పోవాలంటే 14 కి.మీ. దూరం పోవాలి. బయటకు పోలేక మూడు రోజుల పాటూ చెట్లకిందే ఉండిపోవలసి వచ్చింది. ఆ మూడు రోజులూ ఆకలితో మాడాం.[280]

ఖమ్మం జిల్లాకు చెందిన మరో నిర్వాసితుడు తన జీవిత కాలమంతా కూడబెట్టుకున్న సొమ్మును అధికారులు ఎలా తగలబెట్టేశారో చెబుతూ, కాలిన నోట్లను చూపించాడు.

> [కాలిన కరెన్సీ నోట్లను పట్టుకుని] వీటిని చూడండి, మా వస్తువులన్నిటినీ వాళ్ళు మంటల్లో పడేసి తగలబెట్టేశారు. మొదటిసారి నా దగ్గర 7,700 రూపాయలుంటే వాటిని తగలబెట్టేశారు. నేను దాచుకున్న సొమ్ము అంతా అందులోనే ఉందని [అటవీశాఖ] రేంజర్‌తో చెప్పి ప్రాధేయపడ్డాను. అతను "తగలబడి పోనీ. ప్రతిదీ తగలబెట్టేస్తాం," అన్నాడు.[281]

నిర్వాసితులకు మానవతా దృష్టితో సహాయాన్నందించే ఓ ఎన్‌జిఓ కార్యకర్త, ప్రతిసారీ అధికారులు వాళ్ళ బట్టలను కూడా తగలబెట్టేస్తుండడంతో కనీసం మూడుసార్లు తాము బట్టలను సేకరించి పంపిణీ చేశామని వివరించాడు. "వాళ్ళ ఒంటిమీద ఉన్నవి తప్ప మరే గుడ్డపీలికనైనాగానీ వదిలిపెట్టరు," అని చెప్పింది.[282]

అటవీశాఖ అధికారులు నిర్వాసితులను తొలగించే ప్రయత్నాల్లో వారి గూడాలను తగలబెట్టడంతో సరిపెట్టుకోలేదు. నిర్వాసితులను బాది బలవంతంగా ట్రక్కులలోకి ఎక్కించారు. ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు సమీప ప్రాంతాలలో దించేశారు. నిర్వాసితులను అలా తరలించినది నిజమేనని భద్రాచచలం డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్ ఒప్పుకున్నారు. అయితే అదంతా శాంతియుతంగా జరిగిందేనని వర్ణించారు: "సాధారణంగా మేము వాళ్ళకు నోటీసు ఇస్తాము. మా లారీ తీసుకుపోయి వాళ్ళను తీసుకువెళ్ళి శాంతియుతంగా సరిహద్దుల్లో వదిలిపెడతాం."[283] కానీ నిర్వాసితులను మరోచోటికి తరలించడం కోసం తరచుగా వారిని బాదడం లేదా నిర్బంధించడం జరిగిందని హ్యూమన్ రైట్స్ వాచ్ గుర్తించింది. ఇలా బలవంతంగా తరలించేటప్పుడు, నిర్వాసితులు అసమ్మతి తెలియజేయకుండా నివారించడం కోసంగావచ్చు నిర్వాసితులను నిర్బంధించినట్టు తెలిసింది. వరంగల్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన నిర్వాసితుల బృందం తరపున ఒక వ్యక్తి తమను ఎలా నిర్బంధించారో వివరించాడు:

> 2007 జూన్ లేదా జూలైలో, నలుగురు అటవీశాఖ అధికారులు ఇక్కడకు వచ్చారు. మగవాళ్ళందరినీ [అటవీ శాఖ] రేంజ్ ఆఫీసుకు తీసుకుపోయారు. రాత్రంతా ఒక గదిలో బంధించారు. ఆ తర్వాతి రోజున పిల్లలనూ ఆడవాళ్ళనూ లారీలోకి ఎక్కించి

> చర్ల దగ్గర వదిలిపెట్టి, బెదిరించారు. జనాన్ని బలవంతంగా ట్రక్కులలోకి ఎక్కించాక అటవీశాఖ అధికారులు మా గుడిసెలను తగలబెట్టారు. దాదాపు 12 గుడిసెలు తగలబెట్టారు. 5 లేదా 6 గుడిసెలను వదిలేశారు. ఆడవాళ్లూ పిల్లలూ రెండురోజులపాటూ నడిచి గ్రామానికి తిరిగొచ్చారు.[284]

ఖమ్మం జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన ఓ నిర్వాసితుడు తనను ఎలా పాశవికంగా చితకబాదారో వర్ణించాడు:

> [అటవీశాఖ] వాళ్ళు, గ్రామస్థులతో [దగ్గరలోని గ్రామంవాళ్లు] కలిసి వచ్చారు. దాదాపు 8–10 మంది అటవీ శాఖవాళ్లూ, 20–25 మంది గ్రామస్థులూ ఉంటారు. వాళ్ళు మధ్యాహ్నం వచ్చి గ్రామాన్ని చుట్టుముట్టారు. మమ్మల్ని చితకబాదారు. గ్రామాన్ని తగలబెట్టేశారు. నన్ను తీవ్రంగా బాదారు. వాళ్ళు నన్ను చితకబాది నాపక్కటెముకలనూ, వేళ్ళను విరగ్గొట్టారు. నాబుర్రకూడా పగలగొట్టారు. చాలా కుట్లే పడ్డాయి. ఇప్పటికీ నా వేళ్ళు నొప్పి పుడతాయి. నా పక్కటెముకలు బలహీనంగా ఉన్నాయి. నేనిక బరువులు ఎత్తలేను. కాబట్టి శారీరక శ్రమ చేయలేను. నన్ను బాదిన తర్వాత వాళ్ళు, గ్రామానికి [గ్రామం పేరు చెప్పడం లేదు] ఈడ్చుకుపోయి అక్కడ వదిలిపెట్టేశారు. నా సోదరుడు అక్కడికొచ్చి చూసి చింతూరు తీసికెళ్ళాడు [వైద్య సహాయంకోసం]. వాళ్ళు ఆడవాళ్లనూ పిల్లలనూ కూడా లాఠీలతో కొట్టారు. దయన్నదే చూపలేదు. రెండు మూడేళ్ళ పసిపిల్లలను కూడా కొట్టారు.[285]

వరంగల్ జిల్లాలో ఒక స్థానిక కార్యకర్త తాను ఇలా బలవంతంగా తమ గూడెం నుండి వేరే చోటకు తరలించిన ఒక నిర్వాసితుల బృందాన్ని 2006 ఫిబ్రవరిలో చూసానని చెప్పాడు. ఆ విషయాన్ని ఇలా వర్ణించాడు:

> నేను అటవీ శాఖ చెక్‌పోస్టు దాటి నడుచుకుంటూ పోతున్నాను. అక్కడ నాకు వీళ్లు [అంతర్గత నిర్వాసితులు] కనబడ్డారు. బాగా భయపడుతూ కనిపించారు. ఏం జరిగిందని అడిగాను. ఫారెస్టు అధికారులు వాళ్లను దోమాడనుండి తీసుకొచ్చి ఇక్కడ వదిలిపెట్టేసారని వాళ్లు చెప్పారు. నేను వాళ్లను నాతో రమ్మన్నాను. వాళ్లకు సహాయం చేసాను.[286]

సాధారణంగా నిర్వాసితులకు ఎటువంటి ముందస్తు హెచ్చరికలూ చేయకుండానే లేదా వారిని సంప్రదించకుండానే అటవీశాఖ ఈ బలవంతపు తరలింపులకు పాల్పడుతుంటుంది. కాబట్టి, ప్రత్యేకించి ఈ తొలగింపులు వారికి చాలా బాధాకరమైనవి. వాళ్లకు "రాత పూర్వకంగానూ నోటిమాటతోనూ కూడా నోటీసులు ఇస్తాం", "ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం, సెక్షన్ 20 కింద అవసరమైన విధివిధానాన్ని పాటిస్తాం,"[287] అని భద్రాచలం ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ చెప్పారు. అయితే, తొలగింపుకు ఆచరణ సాధ్యమైన ప్రత్యామ్నాయాలను చూడడానికి తమను సంప్రదించిందీ లేదనీ, రాతపూర్వకంగాగానీ నోటిమాటద్వారాగానీ నోటీసు ఇచ్చిందీ లేదని నిర్వాసితులు

చెప్పారు.[288]

వాస్తవానికి, రక్షణ కల్పించమనీ సహాయమందించమనీ ప్రభుత్వాధికారులను పదే పదే కోరామనీ, వాళ్లు తమ విజ్ఞప్తులను విస్మరించడమో లేక తమపైన యింకా కక్షసాధింపు చర్యలను చేపట్టడమో జరిగిందని నిర్వాసితులు చెప్పారు.[289] కొత్తూరు అంతర్గత నిర్వాసితుల గూడాన్ని తగలబెట్టిన తర్వాత కూడా పైన వర్ణించిన విధంగానే జరిగిందని అక్కడ నివాసమున్నవారు చెప్పారు. తాము సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థకు ఓ లేఖను కూడా రాసామనీ కానీ వారినుంచి బదులు లేదనీ చెప్పారు.[290] మరో గ్రామంలో నిర్వాసితులు తమ గూడాన్ని తగలబెట్టిన అటవీశాఖకు, స్థానిక గ్రామస్తులకు వ్యతిరేకంగా పోలీసులు చర్య తీసుకోవాలని కోరారు. పోలీసులు వాళ్ల ఫిర్యాదును పట్టించుకోకపోగా, అటవీ శాఖా, స్థానిక గ్రామస్తులూ వాళ్ల గూడాన్ని మరోసారి నాశనం చేయనిచ్చారు. అంతేకాదు, పోలీసులు బలవంతంగా వాళ్ల ఫిర్యాదును వెనక్కు తీసుకునేలా చేసారు, వాళ్లపైన కేసులు మోపారు. నిర్వాసితులలో ఒకరు ఇలా చెప్పారు:

> ఇది [గూడాన్ని తగలబెట్టడం] జరిగిన తరువాత రెండు లేదా మూడు రోజులకు పోలీసులు అందరినీ పోలీసు స్టేషనుకు పిలిపించారు. అందరిచేతా కాగితాలమీద సంతకాలు చేయించారు. అది, మేము మా కేసును ఉపసంహరించుకోడానికి అంగీకారాన్ని తెలియజేస్తూ రాసిన రాజీపత్రమని తరువాత చెప్పారు. పోలీసు స్టేషనుకి ఫిర్యాదు చేయడానికి వెళ్లిన మావాళ్లు అయిదుగురిపైన కేసు పెట్టారు..... చట్ట విరుద్ధంగా భూమిని ఆక్రమించుకున్నందుకు. మమ్మల్ని భద్రాచలం మేజిస్ట్రేటు ముందు హాజరు పరిచారు. 12 రోజులు జైల్లో గడిపాం. ఆ తర్వాత బెయిల్ మీద మమ్మల్ని విడుదల చేసారు.[291]

వరంగల్ జిల్లాలోని స్థానిక గ్రామస్తులు కొందరు కలిసి అంతర్గత నిర్వాసితులను బలవంతంగా మరోచోటికి తరలించడం కూడదని నచ్చజెప్పడానికి అటవీ శాఖ అధికారులను కలిసారనీ, వాళ్లు తమను బెదిరించి పంపేసారనీ వారిలో ఒకరైన వ్యక్తి చెప్పారు. అతనిలాచెప్పాడు:

> మేమూ ఆదివాసులమే. వాళ్లూ [అంతర్గత నిర్వాసితులు] ఆదివాసులే. కాబట్టి మేం మా తోటి ఆదివాసుల పట్ల వాళ్లు [అటవీ శాఖ అధికారులు] ఎందుకిలా వ్యవహరిస్తున్నారనీ మా మధ్య వివక్షత ఎందుకు చూపుతున్నారనీ అడిగాం. అటవీ శాఖ అధికారులు మా మాటలు వినలేదు. పైగా, వాళ్లను ఇక్కడకు పిలిచింది మేమే కాబట్టి మామీద కేసులు పెడతామని బెదిరించారు. వాళ్లను [అంతర్గత నిర్వాసితులను] అడవులులేని నల్గొండకు తరలించాలని అనుకుంటున్నారని వాళ్లు [అటవీ శాఖ అధికారులు] మాకు తెలిసింది. అదే జరిగితే వాళ్లకు అక్కడ మనుగడ సాగించడమే చాలా కష్టమైపోయి ఉండేది. మేం వాళ్లతో [అధికారులతో] చర్చించి చివరికి వాళ్లను [అంతర్గత నిర్వాసితులను] నల్గొండకుగాక భద్రాచలానికి తీసుకుపోడానికి ఒప్పించాం.[292]

అటవీ శాఖ అధికారులు చట్టానికి లోబడి తమ విధులను నిర్వర్తిస్తున్నారు కాబట్టి వాళ్లపైన పోలీసులు కేసులు నమోదు చేయరని సీనియరు పోలీసు అధికారి ఒకరు ధృవీకరించారు:

> అంతర్గత నిర్వాసితులు అటవీ శాఖకు వ్యతిరేకంగా ఫిర్యాదులు చేస్తుంటారు. ఖచ్చితంగా చెప్పాలంటే అవి ఫిర్యాదులే కావు. వాటిని నమోదు చెయ్యం. ఆక్రమణ దారులను తొలగించడానికి అటవీ శాఖకు అధికారం ఉంది. కాబట్టి వాళ్లపైన ఫిర్యాదులను నమోదు చేయలేం. అందుకని మధ్యేమార్గంగా అంతర్గత నిర్వాసితుల పట్ల మరీ కఠినంగా ఉండవద్దని అటవీ శాఖకు చెబుతాం.[293]

రెండేళ్లకు పైగా పదేపదే ఈ బలవంతపు తరలింపులను అనుభవించాక 2007 మధ్యలో, నిర్వాసితులు స్థానిక ఎన్‌జిఓల సాయంతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషను పెటుకున్నారు.[294] 2007 సెప్టెంబర్‌లో హైకోర్టు మధ్యంతర ఉత్తరువులను జారీ చేస్తూ, "ప్రతివాదులు అటవీ శాఖ అధికారులు వాదుల గుడిసెలను, ఒకవేళ ఏమైనా ఉంటే, నిర్మూలించడం లేదా తగలబెట్టడం చేయవద్దని" ఆదేశించింది.[295] ఈ ఉపశమనం తాత్కాలికమైనదని మధ్యంతర ఉత్తరువులు ఉపసంహరించబడిన వెంటనే అటవీ శాఖ అధికారులు తిరిగి వాళ్లపైన కక్షసాధింపు చర్యలు ప్రారంభిస్తారని స్థానిక ఎన్‌జిఓలు, పిటీషనర్ల న్యాయవాది హ్యూమన్ రైట్స్ వాచ్ వద్ద భయం వ్యక్తం చేసారు.[296]

హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాగానీ అటవీ శాఖ అధికారులు అంతర్గత నిర్వాసితులను ఇతర పద్ధతులలో వేధిస్తూనే ఉన్నారు. ఒక నిర్వాసితుడు ఇలా చెప్పాడు,

> గత ఏడాది [2007] వర్షాకాలంలో చివరిసారి వాళ్లు మా గుడిసెలను తగలబెట్టారు. అప్పుడు మేం హైకోర్టుకు వెళ్లి స్టే ఉత్తర్వులు తెచ్చుకున్నాం. ఆ స్టే ఆర్డరు వచ్చాక అటవీ శాఖ మా గుడిసెలు తగలబెట్టడానికి రాలేదు. కానీ సుమారు ఎనిమిది రోజుల క్రితం వాళ్లు వచ్చారు [సుమారుగా 2007 నవంబర్ చివరి వారం]. మా పని ముట్లన్నిటినీ—గొడ్డళ్లు, కత్తులు, కొడవళ్లు, పారలు లాగేసుకున్నారు. మేమిప్పుడు ఇక ఏ పనీ చేయలేం, డబ్బులేమీ సంపాదించుకోలేం. మేం మా ఇళ్లు కట్టుకోనూ లేం—పనిముట్లు లేకుండా ఇళ్లెలా కట్టుకోగలం?[297]

2008 ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ అధికారులు కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి మరీ కొత్తూరులోని అంతర్గత నిర్వాసితుల గూడాన్ని నాశనం చేసారు. 2007 జనవరి నుండి మొదలుపెట్టి ఆ గూడాన్ని నాశనం చేయడం యిది తొమ్మిదోసారి.[298]

## సల్వాజుడుం వేధింపుల నుండి నిర్వాసితులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యం

ఛత్తీస్‌గఢ్ నుండి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి ఉంటున్న గ్రామస్థులను వెతుక్కుంటూ సల్వాజుడుం సభ్యులు

సరిహద్దు ఇవతలకు వచ్చారని ఆంధ్రప్రదేశ్‌లోని పలువురు నిర్వాసితులు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ వైపున సల్వాజుడుం సభ్యులను తాము చూశామనీ, వాళ్ళు తమనెక్కడ గుర్తించి తీసుకెళ్ళిపోతారోననే నిరంతర భయంతో బతుకుతున్నామనీ  మరికొందరు నిర్వాసితులు చెప్పారు.[299]

సల్వాజుడుం సభ్యులకు వ్యతిరేకంగా పోలీసులకు ఫిర్యాదులు ఏమైనా వచ్చాయా, అని హ్యూమన్ రైట్స్ వాచ్ ఆంధ్రప్రదేశ్‌లోని ఒక సీనియర్ పోలీసు అధికారిని అడిగింది. దానికి ఆయన ఇలా చెప్పాడు:

> సల్వాజుడుం [సభ్యులు] ఆంధ్రప్రదేశ్‌కు వస్తుంటారు. కానీ వాళ్లు వచ్చేది కిరాణా సామానూ, మార్కెట్లూ, వైద్యసహాయం వంటి దైనందిన అవసరాలు తీర్చుకోవడం కోసమే. సల్వాజుడుం [ఛత్తీస్‌గఢ్] ప్రభుత్వం పక్షాన ఉంది. కాబట్టి దానివలన ప్రజలకు వచ్చే సమస్యలేమీ ఉండవు, వాళ్ళకు వ్యతిరేకంగా ఫిర్యాదులూ రాలేదు. సల్వాజుడుం [సభ్యులు] చట్టానికి కట్టుబడేవాళ్లు, ప్రభుత్వ పక్షాన ఉన్నవాళ్ళు. మావోయిస్టులకు వ్యతిరేకంగా తిరగబడినవాళ్ళు. వాళ్ళు ఎప్పుడు ఎక్కడకు వచ్చినా స్వాగతిస్తాం.[300]

ఇటీవలనే, 2007 నవంబరులో సల్వాజుడుం సభ్యులూ పోలీసులూ కలిసి ఛత్తీస్‌గఢ్ నుండి పారిపోయివచ్చి ఆంధ్రప్రదేశ్‌లో నివాసముంటున్న ఇద్దరు గ్రామస్థులను ఎత్తుకుపోయారు.[301] ఈ విషయాన్ని వరంగల్ జిల్లాలోని గ్రామస్థులు హ్యూమన్ రైట్స్ వాచ్‌కి చెప్పారని ఇంతకు ముందు చెప్పాం. సల్వాజుడుం వలన ఆంధ్రప్రదేశ్‌లో ఎలాంటి ప్రమాదమూ లేదని పోలీసులు చెబుతున్నారు. కానీ, ఛత్తీస్‌గఢ్ నుండి వచ్చిన నిర్వాసితులు మాత్రం వారు తమపై వేధింపులు, ఎత్తుకుపోవడాలు, లేదా ఇతర ప్రతీకార చర్యలు సాగిస్తారని భయపడుతున్నారనేది స్పష్టంగానే  కనబడుతోంది.

## నిర్వాసితులకు మానవతావాద సహాయాన్నందించడంలో ప్రభుత్వ వైఫల్యం

ఛత్తీస్‌గఢ్ నుండి వచ్చిన నిర్వాసితులు తమ ఇళ్ళను, పొలాలను, పశువులను అక్కడే వదిలి వెళ్ళక తప్పని గత్యంతరంలేని పరిస్థితుల్లో ఆంధప్రదేశ్‌కు వచ్చిన వాళ్ళు. కాబట్టి వాళ్ళు తమ ఆదాయం కోసం, ఆహారంకోసం ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపైనే ఆధారపడివున్న వాళ్లు. అయినాగానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం, ఆహార సబ్సిడీ పథకం వంటి సామాజిక సంక్షేమ పథకాల వలన కలిగే ప్రయోజనాలను వారికి విస్తరింపజేయడానికి నిరాకరిస్తున్నది. వాళ్ళు "స్థానికంగా నివాసం ఉండేవారు" కారు అనే సాకుని చూపుతున్నది.

ఈ పథకాల అర్హతకు ప్రమాణం "స్థానిక నివాసం కాదు." కాబట్టి ప్రభుత్వం చేపడుతున్న చర్య వివక్షతాపూరితమైనది. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రతను కల్పించాలని భారత కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.[302] గ్రామీణ ప్రాంతంలోని ఏ కుటుంబంనుండైనాగానీ శారీరక శ్రమ చెయ్యడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చే పెద్దవాళ్ళందరికీ "జాబ్ కార్డులు" జారీ చేయమని ఈ చట్టం (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సహా) అన్ని రాష్ట్ర ప్రభుత్వాలనూ కోరింది. ఈ "జాబ్ కార్డులు" ఏడాదికి కనీసం 100 రోజులపాటూ వేతనంతో కూడిన ఉపాధికి హామీనిస్తాయి.[303] ఈ పథకంలో పాల్గొనడానికి జాబ్ కార్డులు

ఉండడం ముందు షరతు. రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకునే పెద్దవాళ్ళు "తాము నివాసముండే ప్రాంతం గ్రామస్థాయిలో ఏ గ్రామ పంచాయతీ పరిధి కిందికి వస్తే ఆ పంచాయితీకి దరఖాస్తు పెట్టుకోవాలి".[304] కనీస నివాస కాలం వంటి నిబంధన దేన్నీ ఈ చట్టం నిర్దేశించలేదు.[305]

ఇంతకు ముందే చెప్పుకున్నట్లుగా, బిజాపూర్, దంతెవాడ జిల్లాలనుండి వచ్చిన నిర్వాసితులు జూన్ 2005 నుండి ఆంధ్రప్రదేశ్‌లో నివాసముంటున్నారు. వ్యవసాయపు పనులు సాగే కాలంలో దాదాపుగా ఈ నిర్వాసితులందరూ బతుకు తెరువు కోసం రోజు కూలీకి వ్యవసాయ శ్రామికులుగా పనిచేయడంపైనే ఆధారపడతారు.[306] అటవీ ఉత్పత్తులు వారికిప్పుడు అందుబాటులో లేవుగాబట్టి, వ్యవసాయపు పనులు లేని కాలంలోప్రధానంగా రోజు కూలీకి శారీరక శ్రమచేయడంపైనే ఎక్కువగా ఆధారపడతారు.[307] కొన్ని సందర్భాలలో నిర్వాసితులు స్థానిక ప్రజల సహాయంతో పని కార్డులు సంపాదించుకున్నారు. అయితే ఈ కొన్ని సందర్భాలను మినహాయిస్తే చాలా సందర్భాలలో నిర్వాసితులు వాళ్లు "స్థానికులు" కారు కాబట్టి జాబ్ కార్డు కోసం వాళ్లు పెట్టుకున్న దరఖాస్తులను స్వీకరించడానికి అధికారులు తిరస్కరించారు.[308] అధికారులు వారి దరఖాస్తులను స్వీకరించిన చాలా సందర్భాలలో కూడా, దరఖాస్తులు పెట్టుకుని నెలలు గడిచిపోయినా ఇంకా జాబ్ కార్డులు ఇవ్వలేదని నిర్వాసితులతో మాట్లాడినప్పుడు తెలిసింది.[309]

నిర్వాసితులకు జాబ్ కార్డులను ఇవ్వాలని కోరుతూ ఒక స్థానిక ఎన్‌జిఓ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి లేఖలు రాసింది.[310] దరఖాస్తులు పెట్టుకుంటే విజ్ఞప్తులు చేస్తే ప్రభుత్వం మాట ఇచ్చింది, కానీ అత్యధికులకు జాబ్ కార్డులు మంజూరు చేసేవిధంగా చర్యలు చేపట్టడంలో విఫలమైంది.[311]

నిర్వాసితులకు  స్థిరమైన ఆదాయమంటూ లేదు. పైగా వారికి అటవీ ఉత్పత్తులు అసలు అందుబాటులో లేవు లేదా పరిమితంగానే అందుబాటులో ఉన్నాయి. దీంతో వాళ్లకు తీవ్ర ఆహార సమస్య ఏర్పడింది.[312] ప్రభుత్వపు నిర్దిష్ట లబ్దిదారుల ప్రజా పంపిణీ పథకం (టార్గెటెడ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ స్కీం), పేదలకు సబ్సిడీ రేట్లకు ఆహార ధాన్యాల పంపిణీకి హామీ కల్పించడానికి ఉద్దేశించినది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న గ్రామస్థులందరికీ రేషన్ కార్డులను జారీ చేసి ఈ పథకం వలన ప్రయోజనం పొందడానికి వీలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వాల (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సహా) బాధ్యత. రేషన్ కార్డులున్నవాళ్ళు రేషన్ షాపుల నుండి సబ్సిడీ రేట్లకు తిండిగింజలను కొనుక్కోగలుగుతారు.

జిల్లా కలెక్టరు అనుమతి ఇవ్వడానికి నిరాకరించడంతో రేషన్ కార్డుల కోసం తాము పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించనే లేదని ఖమ్మం, వరంగల్ జిల్లాలోని చాలా మంది నిర్వాసితులు చెప్పారు:

రేషన్ కార్డు కోసం ఏడాది క్రితం మేం ఫోటోలిచ్చాం. కాని మాకింతవరకు కార్డు ఇవ్వలేదు. జిల్లా కలెక్టరు అనుమతి లభించిన తర్వాత మాత్రమే మాకు రేషన్ కార్డులు ఇస్తారని రేషన్ ఆఫీసర్ చెప్పాడు.[313]

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానాన్ని ఖమ్మం జిల్లా సబ్ కలెక్టర్ ఇలా చెప్పాడు:

> రేషన్ కార్డులను జారీ చేయవద్దనేది మా స్పష్టమైన విధానం. రేషన్ కార్డులు, సబ్సిడీ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నది. మరో రాష్ట్రం నుండి వచ్చిన వాళ్ళకు మా రాష్ట్రమెందుకు సబ్సిడీ ఇవ్వాలి? ..... ఇకపోతే శాంతిభద్రతలూ రక్షణ సమస్య కూడా ఉంది. వీరిలో చాలామంది [నిర్వాసితులు] నిజంగా నిర్వాసితులు కారు. నక్సలైట్లకు సంబంధించినవాళ్లు చాలామందే ఉన్నారు. విస్థాపన ముసుగులో వాళ్ళు [నిర్వాసితులు] నక్సలైట్లకు సహాయం చేస్తున్నారు. కాబట్టి మేము దీన్ని [ఆంధ్రప్రదేశ్‌లో స్థిరపడడాన్ని] ప్రోత్సహించాలనుకోవడం లేదు.[314]

చాలాచోట్ల నిర్వాసితులకు తాగునీరు అందుబాటులో లేదు. ఉదాహరణకు, ఒక గ్రామంలో దోమలతో నిండిన నీటి గుంటలలోని నీటిని నిర్వాసితులు ఉపయోగిస్తుండడాన్ని స్థానిక ఎన్‌జిఓ కార్యకర్తలు హ్యూమన్ రైట్స్ వాచ్ బృందానికి చూపించారు. వారిలో చాలామంది పదే పదే అనారోగ్యం పాలయ్యారు. తాగునీటి కోసం తాము 1 నుండి 5 కిలోమీటర్ల వరకు  నడిచి పోవాల్సి వస్తుందని చాలామంది నిర్వాసితులు చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణమే నిర్వాసితుల గూడాల రక్షణకు హామీని కల్పించాలి. అంతేకాదు, నిర్వాసితులతో సంప్రదించి వారికోసం ఒక సమగ్ర పునరావాస పథకాన్ని రూపొందించేవరకూ ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నిటి వలన కలిగే ప్రయోజనాలు వారికి కూడా అందేలా వాటిని విస్తరింపజేయాలి.

## ఆంధ్రప్రదేశ్‌లో నిర్వాసితుల పిల్లలకు ఉన్న విద్యావకాశాలు

ఆంధ్రప్రదేశ్‌లోని స్కూళ్ళలో తెలుగులో చదువు చెప్తారు. ఛత్తీస్‌గఢ్‌లో హిందీలో చదువు చెప్తారు. కాబట్టి ఆంధ్రప్రదేశ్‌కు పారిపోయి వచ్చిన నిర్వాసితుల పిల్లలు తరచుగా మధ్యలోనే బడి మానేస్తుంటారు.[494] దీనికితోడు, చాలామంది పిల్లలవద్ద ఛత్తీస్‌గఢ్ స్కూళ్ళనుండి వచ్చినట్లు టి.సి.లు లేవు. దీంతో వాళ్ళను ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక స్కూళ్ళలో చేర్చడం కష్టమవుతోంది.[495] సితార ఫౌండేషన్ అనే స్థానిక ఎన్‌జిఓ నిర్వాసితులకు వైద్యం, తదితర మానవతావాద సహాయాన్ని అందిస్తున్నది. ఆ సంస్థ చెప్పినదాని ప్రకారం ఒక్క చింతూరు మండలంలోనే సుమారు 450 మంది నిర్వాసితుల పిల్లలు అర్ధాంతరంగా చదువు మానేశారు.[496]

హిందీ భాషలో బోధించే రెసిడెన్షియల్ బ్రిడ్జి కోర్సును మంజూరు చేయాలని స్థానిక ఎన్‌జిఓలూ, కార్యకర్తలూ విజ్ఞప్తులు చేసారు. అయినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నివేదిక రాసేనాటికి ఒక్క హిందీ బ్రిడ్జి స్కూలును కూడా మంజూరు చేయలేదు (ప్రధాన స్రవంతిలో స్కూళ్లకు పోకుండా ఉండే పిల్లలను రెగ్యులర్ స్కూళ్ళలో చేర్చడం కోసం ఉద్దేశించిన కోర్సు బ్రిడ్జి కోర్సు).[497] వరంగల్ జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఎ) ప్రాజెక్టు ఆఫీసర్ ఇలా చెప్పారు:

> భాష సమస్య వలనా, దూరం కారణంగా కూడా నిర్వాసితులు స్కూలుకు హాజరు కావడంపట్ల అంత ఆసక్తి చూపడంలేదు..... ఈ జిల్లాలో [స్థానిక] ఆదివాసుల మాతృభాష

> తెలుగు. కాబట్టి మేము మరే ఇతర భాషల స్కూళ్ళను ఏర్పాటు చేయడానికి ప్లాన్ చేయడం లేదు. ఇతర జిల్లాల్లో, ఇతర భాషల స్కూళ్లు ఉన్నాయి.[498]

ఖమ్మం జిల్లా ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ నిర్వాసితులతో సహా అందరి పిల్లలనూ స్కూళ్ళల్లో చేర్చుకుంటారని హామీనిచ్చారు. కానీ చదువుకోడానికి అడ్డంకిగా వున్న భాషా సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారు. ఆయన ఈ భాషా సమస్యకు ఒక "పరిష్కారం" ప్రతిపాదించారు. నిర్వాసితుల పిల్లలకు రెండు భాషలు (హిందీ, కోయ) తెలుసు. కాబట్టి వాళ్ళు లోతట్టు గ్రామాలలోని కోయ స్కూళ్ళకు వెళ్ళవచ్చుననేది ఆయన చెప్పిన పరిష్కారం. దీని వలన భాషాపరమైన అడ్డంకి పరిష్కారం కాదని ఒక స్థానిక ఎన్‌జిఓ కార్యకర్త తెలిపారు. ఎందుకంటే కోయభాషకు తెలుగు లిపిని వాడుతారు. అంటే తెలుగు మీడియం స్కూళ్ళలో ఎదురయ్యే సమస్యే ఇక్కడా ఎదురవుతుంది.[499]

భారత కేంద్ర ప్రభుత్వమూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వమూ తక్షణమే ప్రభుత్వ రక్షణ బలగాలు స్కూలు భవనాలను ఉపయోగించుకోవడాన్ని నివారించేలా, దెబ్బతిన్న స్కూళ్ళను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలి. స్కూలు చదువు అవసరాల రీత్యా వేరు వేరు చోట్ల ఉండే పిల్లలకూ తల్లిదండ్రులకూ మధ్య సంబంధాలు కొనసాగడానికి అవకాశముండేలా చర్యలు చేపట్టాలి. లోతట్టు ప్రాంతాలలోని ప్రజలు ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకోవడానికి వీలుగా నక్సలైట్లు స్కూళ్ళను నాశనం చేయడం తక్షణమే మానేయాలి. నిర్వాసితుల పిల్లలు చదువు కొనసాగించగలగడానికి భరోసా కల్పించడానికిగాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణమే వారికి విద్యావకాశాన్ని కల్పించాలి.

# వివరణలు

[178] భద్రాచలం డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్ బి. షఫియుల్లా, భద్రాచలంలోని ఖమ్మం జిల్లా సబ్–కలెక్టర్ కె. భాస్కర్‌లతో 2007 డిసెంబర్ 7న హ్యూమెన్ రైట్స్ వాచ్ నిర్వహించిన ఇంటర్వ్యూలు.

[179] పైన సూచించినదే.

[180] ఐ.సి.ఇ.ఎస్.ఆర్., ఆర్టికల్ 11.1.

[181] ఐ.సి.ఇ.ఎస్.ఆర్., ఆర్టికల్ 2.1.

[182] అంతర్గత విస్థాపనకు సంబంధించిన ఐక్య రాజ్య సమితి మార్గదర్శక సూత్రాలు, ఐ.రా.స. డాక్యుమెంటు ఇ/సిఎన్.4/1998/53/చేర్పు.2; 1998 నవంబర్ 11, ఐ.రా.స. విస్థాపనా నియమాలకు ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలనేమీ లేదు. అయినాగానీ అవి అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాన్నీ, అంతర్జాతీయ మానవతావాద చట్టాన్నీ ప్రతిఫలించేవి, వాటికి అనుగుణమైనవి. అంతర్గత నిర్వాసిత సమస్యను ఎదుర్కొనే ప్రభుత్వాలకు మార్గదర్శకత్వాన్ని అందించడానికి ఉద్దేశించినవి. ఇంటర్–ఏజన్సీ స్టాండింగ్ కమిటీలోని వివిధ ఐ.రా.స. ఏజన్సీలూ ప్రభుత్వేతర ఐక్య గ్రూపులూ ఈ విస్థాపనా నియమాలకు ఆమోదం తెలిపాయి. ఉత్తర దక్షిణ అమెరికాలలోని, ఆఫ్రికా ఐరోపాలలోని ప్రాంతీయ సంస్థలు వీటిని ఆమోదించాయి లేదా గుర్తించాయి. వలస, శరణార్థులు, జనాభా సమస్యలపైన ఐరోపా కౌన్సిల్ నియమించిన పార్లమెంటరీ అసెంబ్లీ కమిటీ కూడా ఈ విస్థాపనా నియమాలను ఆమోదించింది. నిర్వాసిత సమస్య వున్న దేశాలలో నిజ నిర్ధారణ కార్యకలాపాలను చేపట్టే క్రమంలో ఈ విస్థాపనా నియమాలను గౌరవించాలని ఆ అసెంబ్లీ కమిటీ సూచించింది. విడి విడిగా ప్రభుత్వాలు వీటిని తమ జాతీయ విధానాలలో చట్టాలలో చేర్చడమూ మొదలైంది. కొన్ని దేశాల న్యాయస్థానాలు వీటిని, ప్రస్తుత అంతర్జాతీయ చట్టానికి సందర్భోచితమైన పునరుద్ఘాటనగా ప్రస్తావించడమూ మొదలైంది. మరింత సమాచారం కోసం చూడండి: *అంతర్గత నిర్వాసితులపై ప్రధాన కార్యదర్శి ప్రతినిధి నివేదిక*, ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల కమిషన్; *ప్రత్యేక గ్రూపులూ వ్యక్తులు: భారీ ఎత్తున సాగే తరలింపు, నిర్వాసిత ప్రజలు*, డా. ఫ్రాన్సిస్ డెంగ్, జనవరి 16 2002, ఇ/సిఎన్.4/2002/95, ఇంటర్నల్ డిస్‌ప్లేస్‌మెంట్:రీసెంటె కామెంటరీస్ ఎబౌట్ ద నేచర్ అండ్ అప్లికేషన్ ఆఫ్ ద గైడింగ్ ప్రిన్సిపుల్స్ ఆన్ ఇంటర్నల్ డిస్‌ప్లేస్‌మెంట్, ఏప్రిల్ 2002.

[183] ఐరాస విస్థాపనా నియమాలు, సూత్రం 15 (డి).

[184] ఐరాస విస్థాపనా నియమాలు, సూత్రం 6 (ఇ), 21.

[185] ఐరాస విస్థాపనా నియమాలు, సూత్రం 15 (ఎ), 7 (బి).

[186] ఐరాస విస్థాపనా నియమాలు, సూత్రం 7 (ఇ).

[187] ఐరాస విస్థాపనా నియమాలు, సూత్రం 18.

[188] ఐరాస విస్థాపనా నియమాలు, సూత్రం 29.

[189] ఐరాస విస్థాపనా నియమాలు, సూత్రం 30.

[190] ఐరాస విస్థాపనా నియమాలు, సూత్రం 28.

[191] ఐరాస విస్థాపనా నియమాలు, సూత్రం 29.

[262] హ్యూమన్ రైట్స్ వాచ్ జరిపిన ఇంటర్వ్యూలు, నవంబరు 30, 2007న జె. పి. రావుతో రెండవ ఇంటర్వ్యూ, సీనియర్ పోలీసు అధికారి ఎస్4తో (పేరువెల్లడి చేయవద్దని కోరారు, ప్రాంతం ఇవ్వడం లేదు) 2007 డిసెంబరు 5 ఇంటర్వ్యూ. "అంతర్గత అశాంతి వలన ప్రభావితులైన పిల్లల ఆరోగ్య, విద్యా పరిస్థితులపై పరిశీలనకై దంతెవాడ (ఛత్తీస్‌ఘడ్), ఖమ్మం (ఆంధ్రప్రదేశ్) జిల్లాల సందర్శన, డిసెంబరు 17–19, 2007" నివేదిక, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ (ఎన్‌సిపిసిఆర్)మార్చ్ 2008, పే. 37. ఈ కమీషనూ, సీనియర్ పోలీసు అధికారి ఎస్4కూడా ఆంధ్రప్రదేశ్‌లో తలదాచుకున్న నిర్వాసిత ప్రజల సంఖ్య 30,000 అని అంచనా వేసారు. కాగా, వీరి సంఖ్య దాదాపు 50,000 అని రావు అంచనా కట్టారు.

[263] 2007 నవంబరు 28న హ్యూమన్ రైట్స్ వాచ్ జె. పి. రావుతో జరిపిన ఇంటర్వ్యూ, మొదటి ఇంటర్వ్యూ.

[264] 2007 డిసెంబర్ 7న భద్రాచలం డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్ బి. షఫియుల్లాతో హ్యూమెన్ రైట్స్ వాచ్ నిర్వహించిన ఇంటర్వ్యూలు.

ఇతర అధికారులు కూడా యిలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేసారు. భద్రాచలంలోని ఖమ్మం జిల్లా సబ్–కలెక్టర్ కె. భాస్కర్‌తో 2007 డిసెంబర్ 7న, సీనియర్ పోలీసు అధికారి ఎస్4తో (పేరువెల్లడి చేయవద్దని కోరారు, ప్రాంతం ఇవ్వడం లేదు) 2007 డిసెంబరు 5న హ్యూమన్ రైట్స్ వాచ్ నిర్వహించిన ఇంటర్వ్యూలు.

ప్రవాహంలాగా వచ్చిపడుతున్న అంతర్గత నిర్వాసితుల పట్ల తమ ప్రస్తుత వైఖరికి ఈ ప్రభుత్వాధికారులు పలు కారణాలను తెలియజేసారు. నిర్వాసితులకు రక్షణ సహాయాలను అందించకపోవడానికి ప్రధానమైన కారణం భద్రతకు సంబంధించినది. చట్టాన్ని అమలుపరిచే ఒక సీనియర్ అధికారి అంతర్గత నిర్వాసితులు వచ్చిపడడమనేది రాష్ట్రంలో భద్రతాపరమైన ప్రమాద ఘంటికను మోగించిందంటూ వాదించారు: 'ఈ అంతర్గత నిర్వాసితులలో చాలామంది మావోయిస్టులు పంపినవాళ్ళు. ఈ నిర్వాసితులు మావోయిస్టులకు ఒక కవరుగామారే వీలుంది. మావోయిస్టులు ఈ అడవులలో తమ కార్యకలాపాలనూ, దాడులనూ ఉధృతం చేయడానిక అది వీలు కలిగిస్తుంది. అంతర్గత నిర్వాసితుల సమస్య ఒక "సామాజిక సమస్యే." కానీ "ఇప్పటివరకైతే మాత్రం మాకు [ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి] ఇది సామాజిక సమస్యగా కంటే ఎక్కువగా భద్రతాపరమైన సమస్యగానే ఉంటోంది," అని ఖమ్మం జిల్లా సబ్–కలెక్టర్ పేర్కొన్నారు. నిర్వాసితులకు సహాయం అందించక పోవడానికి తరచుగా వారు చూపే మారో కారణం, స్థానిక ఆదివాసీ ప్రజలనుండి వస్తున్న వ్యతిరేకత.

[265] దిగువ చూడండి. దేశంలోని చట్టాన్ని అనుసరించి ఈ తొలగింపులకు ఉన్న చట్టబద్ధతను ప్రశ్నిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఒక న్యాయవివాదం నడుస్తోంది.

[266] ఐరాస ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల కమిటీ,"తగు గృహవసతిని కలిగివుండే హక్కు: బలవంతపు తొలగింపులు (ఆర్టికల్ 11.1)," జనరల్ కామెంట్ నం. 7, ఇ/1998/22, అనుబంధం IV (1998, పేరా. 13.)

[267] పైన సూచించినదే, పేరాలు 14, 16.

[268] పైన సూచించినదే, పేరా. 16; ఐరాస ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల కమిటీ,"తగు గృహవసతిని కలిగివుండే హక్కు: బలవంతపు తొలగింపులు (ఆర్టికల్ 11.1)," జనరల్ కామెంట్ నం. 4, ఇ/1992/23, అనుబంధం (1991), పేరా. 8. జనరల్ కామెంట్ నం. 4 "తగిన గృహవసతి" అనే భావనను పరిశీలిస్తుంది. నివాసముండడానికి చట్టసమ్మతమైన రక్షణ వుండడమూ, సేవలూ వస్తుసామాగ్రీ సౌకర్యాలూ మౌలిక

సదుపాయాలూ లభ్యం కావడమూ స్తోమతకు అందేవిగా వుండడమూ, నివాసయోగ్యతా, అందుబాటులో వుండడమూ, ప్రాంతమూ, సాంస్కృతికంగా తగినదిగా వుండడమూ అనేవికూడా "తగిన గృహవసతి" కిందికి వస్తాయి.

[269] ఐరాస ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల కమిటీ, "తగు గృహ వసతిని కలిగివుండే హక్కు: బలవంతపు తొలగింపులు," పేరా. 13.

[270] పైన సూచించినదే, పేరా. 15

[271] డిసెంబర్ 5, 2007న హ్యూమన్ రైట్స్ వాచ్ ఖమ్మం జిల్లాలోని సితార సంస్థ ఆర్గనైజర్లతో కలిసి కె7 గ్రామంలో జరిపిన పర్యటన.

[272] హ్యూమన్ రైట్స్ వాచ్, డిసెంబర్ 7, 2007న బి. షఫియుల్లా, కె. భాస్కర్‌లతోనూ, డిసెంబర్ 5, 2007న సీనియర్ పోలీసు అధికారి ఎస్4తోనూ (పేరు వెల్లడి చేయవద్దని కోరారు) జరిపిన ఇంటర్వ్యూలు.

[273] 2007 నవంబర్ 29–డిసెంబర్ 8 మధ్య దంతెవాడ, బిజాపూర్ జిల్లాలోని వివిధ గ్రామాలలోనూ, ఖమ్మం, వరంగల్ జిల్లాలలోని డబ్ల్యూ1, డబ్ల్యూ2, డబ్ల్యూ3, డబ్ల్యూ4, డబ్ల్యూ7, కె5, కె7, కె8, కొత్తూరు గ్రామాలలోనూ పలువురు అంతర్గత నిర్వాసితులతో హ్యూమన్ రైట్స్ వాచ్ బృందం జరిపిన ఇంటర్వ్యూలు. గుడిసెలు కాలబెట్టి బలవంతంగా తరలించడం జరిగిన ఈ తొమ్మిది సందర్భాలలో అటవీ శాఖ అధికారులు ఆరింటిలో పాల్గొన్నారు. గుడిసెలు కాలబెట్టిన మిగతా మూడు గ్రామాలు కొత్తూరు, కె7, కె8. ఈ మూడు గ్రామాలలో అటవీ శాఖ అధికారులు స్థానిక ఆదివాసులను నిర్వాసితుల గుడిసెలు తగుల బెట్టేవిధంగా రెచ్చగొట్టారు. నిర్వాసితులు ఈ విషయాన్ని హ్యూమన్ రైట్స్ వాచ్ బృందానికి చెప్పారు.

[274] నవంబర్ 29–డిసెంబర్ 8, 2007 మధ్య ఖమ్మం, వరంగల్ జిల్లాలలోని డబ్ల్యూ1, డబ్ల్యూ2, డబ్ల్యూ3, డబ్ల్యూ4, డబ్ల్యూ7, కె5, కొత్తూరు, కె7, కె8 గ్రామాలలోని అంతర్గత నిర్వాసితులతో హ్యూమన్ రైట్స్ వాచ్ చేసిన ఇంటర్వ్యూలు.

[275] డిసెంబర్ 4, 2007న హ్యూమన్ రైట్స్ వాచ్ ఖమ్మం జిల్లాలోని కొత్తూరుకు చెందిన కన్నాయి గూడెం. నిర్వాసితుడు ప్రకాశ్‌తో (మారుపేరు) జరిపిన ఇంటర్వ్యూ.

[276] 2007 డిసెంబర్ 4–6 తేదీలలో దంతెవాడ, బిజాపూర్ జిల్లాలోని వివిధ గ్రామాలలోనూ, ఖమ్మం జిల్లాలోని కె7, కె8 గ్రామాలలోనూ పలువురు అంతర్గత నిర్వాసితులతో జరిపిన ఇంటర్వ్యూలు. అటవీశాఖ అధికారులు స్థానిక గ్రామస్తులతో కలిసి తమ గూడేలపైన దాడి జరిపారని ఈ మూడు గ్రామాల అంతర్గత నిర్వాసితులు చెప్పారు.

[277] 2007 నవంబర్ 28–డిసెంబర్ 8 మధ్య దంతెవాడ, బిజాపూర్ జిల్లాలోని వివిధ గ్రామాలలోనూ, ఖమ్మం, వరంగల్ జిల్లాలలోని డబ్ల్యూ2, డబ్ల్యూ3, డబ్ల్యూ4, డబ్ల్యూ7, కె5, కె9, డబ్ల్యూ6, కె1, కె2, కె3, కె10, కె11 గ్రామాలలోనూ పలువురు అంతర్గత నిర్వాసితులతో హ్యూమన్ రైట్స్ వాచ్ బృందం జరిపిన ఇంటర్వ్యూలు. ఆంధ్రప్రదేశ్‌లో సురక్షితంగా నివాసమేర్పరుచుకోడానికి స్థానిక ఆదివాసి ప్రజలు తమకు పలు విధాలుగా ఎలా సహాయాన్ని అందించారో ఈ పన్నెండు గ్రామాలలోని నిర్వాసితులు వర్ణించారు.

[278] 2007 డిసెంబర్ 4న దంతెవాడ, బిజాపూర్ జిల్లాలోని వివిధ గ్రామాలలోనూ, ఖమ్మం జిల్లాలోని కె5 గ్రామంలోనూ పలువురు అంతర్గత నిర్వాసితులతో హ్యూమన్ రైట్స్ వాచ్ బృందం జరిపిన ఇంటర్వ్యూలు.

[279] 2007 నవంబర్ 30న వరంగల్ జిల్లాలోని డబ్ల్యూ4 గ్రామం బారెంకు చెందిన దిలీప్ (మారుపేరు) అనే అంతర్గత నిర్వాసితునితో హ్యూమన్ రైట్స్ వాచ్ జరిపిన ఇంటర్వ్యూ.

[280] 2007 డిసెంబర్ 4న ఖమ్మం జిల్లాలోని కన్నయ్యగూడ, కొత్తూరులకు చెందిన అంతర్గత నిర్వాసితులైన ప్రకాశ్‌తోనూ (మారుపేరు), మరో గ్రామస్తునితోనూ హ్యూమన్ రైట్స్ వాచ్ బృందం జరిపిన ఇంటర్వ్యూ.

[281] 2007 డిసెంబర్ 5న ఖమ్మం జిల్లాలోని కె7 గ్రామంలో నేంద్రకు చెందిన అంతర్గత నిర్వాసితుడు-3తో (పేరు వెల్లడి చేయవద్దని కోరారు) హ్యూమన్ రైట్స్ వాచ్ జరిపిన ఇంటర్వ్యూ.

[282] 2007 డిసెంబర్ 5న చింతూరుకు చెందిన సితార సంస్థకు చెందిన సరోజినీ హనీఫ్‌తో హ్యూమన్ రైట్స్ వాచ్ జరిపిన ఇంటర్వ్యూ.

[283] 2007 డిసెంబర్ 7న బి. షఫియుల్లాతో హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూలు. ఖమ్మం జిల్లా సబ్ కలెక్టర్ కూడా ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తంచేసారు: 2007 డిసెంబర్ 7న కె. భాస్కర్‌తో హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూ.

[284] 2007 నవంబర్ 29న వరంగల్ జిల్లాలోని డబ్ల్యూ2 గ్రామంలో పలువురు అంతర్గత నిర్వాసితులతో (వాళ్లు తమ పేర్లు వెల్లడి చేయవద్దని కోరారు) హ్యూమన్ రైట్స్ వాచ్ బృందం జరిపిన ఇంటర్వ్యూ.

[285] 2007 డిసెంబర్ 5న ఖమ్మం జిల్లాలోని కె7 గ్రామంలో నేంద్రకు చెందిన అంతర్గత నిర్వాసితుడు-3తో (పేరు వెల్లడి చేయవద్దని కోరారు) హ్యూమన్ రైట్స్ వాచ్ జరిపిన ఇంటర్వ్యూ.

[286] 2007 డిసెంబర్ 1న వరంగల్ జిల్లాలోని డబ్ల్యూ7 గ్రామానికి చెందిన ఓ స్థానిక కార్యకర్తతో (పేరు వెల్లడి చేయవద్దని కోరారు) హ్యూమన్ రైట్స్ వాచ్ జరిపిన ఇంటర్వ్యూ.

[287] 2007 డిసెంబర్ 7న బి. షఫియుల్లాతో హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూలు.

[288] తొలగింపుకు గురైన ఈ అంతర్గత నిర్వాసితులలో ఎవ్వరికీ ప్రభుత్వం రాతపూర్వకంగా గానీ లేదా నోటిమాటగాగానీ నోటీసు ఇవ్వలేదని తెలిసింది.

[289] 2007 డిసెంబర్ 4-7 మధ్య దంతెవాడ, బిజాపూర్ జిల్లాలోని వివిధ గ్రామాలలోనూ, ఖమ్మం జిల్లాలోని కె5, కె7, కొత్తూరు, కె8 గ్రామాలలోనూ పలువురు అంతర్గత నిర్వాసితులతో హ్యూమన్ రైట్స్ వాచ్ జరిపిన ఇంటర్వ్యూలు.

[290] 2007 డిసెంబర్ 4న ఖమ్మం జిల్లాలోని కన్నాయి గూడెం, కొత్తూరులకు చెందిన అంతర్గత నిర్వాసితులు ప్రకాశ్‌తోనూ (మారుపేరు), మరో గ్రామస్తునితోనూ హ్యూమన్ రైట్స్ వాచ్ జరిపిన ఇంటర్వ్యూ.

[291] 2007 డిసెంబర్ 5న ఖమ్మం జిల్లాలోని కె7 గ్రామంలో నేంద్రకు చెందిన అంతర్గత నిర్వాసితుడు-3తో (పేరు వెల్లడి చేయవద్దని కోరారు) హ్యూమన్ రైట్స్ వాచ్ జరిపిన ఇంటర్వ్యూ.

[292] 2007 నవంబర్ 29న వరంగల్ జిల్లాలోని స్థానిక గ్రామస్తులతో (వాళ్లు తమ పేర్లు వెల్లడి చేయవద్దని కోరారు) హ్యూమన్ రైట్స్ వాచ్ బృందం జరిపిన ఇంటర్వ్యూ.

[293] 2007 డిసెంబరు 5న సీనియర్ పోలీసు అధికారి ఎస్4తో (పేరు వెల్లడి చేయవద్దని కోరారు, ప్రాంతాన్ని ఇవ్వడం లేదు) హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూ.

[294] మడకం నందయ్య తదితరులు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, కూనవరం, ఖమ్మం జిల్లా తదితరులకు వ్యతిరేకంగా దాఖలు చేసిన రిట్ పిటిషన్ నం.19594 (2007), వంజం కూనయ్య తదితరులు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్,

వి. ఆర్. పురం, ఖమ్మం జిల్లా తదితరులకు వ్యతిరేకంగా దాఖలు చేసిన రిట్ పిటిషన్ నం.19571 (2007), తుర్రం ముత్తయ్య తదితరులు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, చింతూరు, ఖమ్మం జిల్లా తదితరులకు వ్యతిరేకంగా దాఖలు చేసిన రిట్ పిటిషన్ నం.19599 (2007). ఈ పిటిషన్లలో నిర్వాసితులను బలవంతంగా తొలగించడాన్ని, భారత ఆటవీ చట్టాల ప్రకారం ఆదివాసి ప్రజల హక్కుల ఉల్లంఘనేనని ఈ పిటిషన్లలో వాదించారు.

[295] పైన సూచించినదే, 2007 సెప్టెంబర్ 27 హైకోర్టు మధ్యంతర ఉత్తరువులు.

[296] 2007 నవంబర్ 27న కె. బాలగోపాల్‌తో హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూలు (మొదటి ఇంటర్వ్యూ); 2007 డిసెంబర్ 4, డా. హనీఫ్, సితార సంస్థ, చింతూరు (మొదటి ఇంటర్వ్యూ).

[297] 2007 డిసెంబర్ 5న ఖమ్మం జిల్లాలోని కె7 గ్రామంలో నేంద్రకు చెందిన అంతర్గత నిర్వాసితుడు-3తో (పేరు వెల్లడి చేయవద్దని కోరారు) హ్యూమన్ రైట్స్ వాచ్ జరిపిన ఇంటర్వ్యూ.

[298] 2008 ఏప్రిల్ 9న డా. హనీఫ్, చింతూరుతో హ్యూమన్ రైట్స్ వాచ్ జరిపిన టెలిఫోన్ ఇంటర్వ్యూ (మూడో ఇంటర్వ్యూ).

[299] ఆంధ్రప్రదేశ్‌కు పారిపోయిన గ్రామీణ ప్రజలపైన సల్వాజుడుం ప్రతీకార చర్యలు, పూర్తి నివేదికలోని సెక్షన్ IV D ని  చూడండి. పూర్తి నివేదిక http://www.hrw.org. లో ఇంగ్లీషులో దొరుకుతుంది.

[300] 2007 డిసెంబరు 5న సీనియర్ పోలీసు అధికారి ఎస్4తో (పేరు వెల్లడి చేయవద్దని కోరారు, ప్రాంతాన్ని ఇవ్వడం లేదు) హ్యూమెన్ రైట్స్ వాచ్  ఇంటర్వ్యూ.

[301] ఆంధ్రప్రదేశ్‌కు పారిపోయిన గ్రామీణ ప్రజలపైన సల్వాజుడుం ప్రతీకార చర్యలు, పూర్తి నివేదికలోని సెక్షన్ IV D ని ని  చూడండి. పూర్తి నివేదిక http://www.hrw.org. లో ఇంగ్లీషులో దొరుకుతుంది.

[302] జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 (2005లో వచ్చిన 42 వచట్టం). http://www.commonlii.org/in/legis/num_act/nrega2005375/(accessed May 13, 2008).

[303] జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, 2005, సెక్షన్ 5, షెడ్యూలుII తో కలిపి చదుపుకోవాలి.

[304] పైన సూచించినదే.

[305] 2007 నవంబర్ 27న కె. బాలగోపాల్‌తో హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూ, మొదటి ఇంటర్వ్యూ.

[306] 2007 నవంబర్ 29-డిసెంబర్ 8 మధ్య దంతెవాడ, బిజాపూర్ జిల్లాలోని వివిధ గ్రామాలలోనూ, ఖమ్మం, వరంగల్ జిల్లాలలోని డబ్ల్యూ1, డబ్ల్యూ2, డబ్ల్యూ3, డబ్ల్యూ4, డబ్ల్యూ5, డబ్ల్యూ6, డబ్ల్యూ7, కె1, కె2, కె3, కె4, కె5, కొత్తూరు, కె7, కె8, కె9, కె10, కె11 గ్రామాలలోనూ పలువురు అంతర్గత నిర్వాసితులతో హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూలు.

[307] పైన సూచించినదే.

[308] 2007 నవంబర్ 29-డిసెంబర్ 1 మధ్య దంతెవాడ జిల్లాలోని వివిధ గ్రామాలలోనూ, ఖమ్మం జిల్లాలోని కె2, కె9 గ్రామాలలోనూ పలువురు అంతర్గత నిర్వాసితులతో హ్యూమన్ రైట్స్ వాచ్ బృందం ఇంటర్వ్యూలు.

[309] 2007 నవంబర్ 29-డిసెంబర్ 1 మధ్య దంతెవాడ, బిజాపూర్ జిల్లాలోని వివిధ గ్రామాలలోనూ, వరంగల్ జిల్లాలోని డబ్ల్యూ3, డబ్ల్యూ4, డబ్ల్యూ7 గ్రామాలలోనూ పలువురు అంతర్గత నిర్వాసితులతో హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూలు.

[310] మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి కె. బాలగోపాల్, ఉపాధ్యక్షులు ఎస్. జీవన్‌కుమార్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శికి 2006 డిసెంబర్‌లో రాసిన లేఖ; మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి కె. బాలగోపాల్, ఉపాధ్యక్షులు ఎస్. జీవన్‌కుమార్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శికి 2008 జనవరిలో రాసిన లేఖ

[311] 2007 నవంబర్ 27న కె. బాలగోపాల్‌తో హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూ, మొదటి ఇంటర్వ్యూ.

[312] 2007 నవంబర్ 29–డిసెంబర్ 8 మధ్య దంతెవాడ, బిజాపూర్ జిల్లాలోని వివిధ గ్రామాలలోనూ, ఖమ్మం, వరంగల్ జిల్లాలలోని డబ్ల్యూ1, డబ్ల్యూ2, డబ్ల్యూ3, డబ్ల్యూ4, డబ్ల్యూ5, డబ్ల్యూ6, డబ్ల్యూ7, కె1, కె2, కె3, కె4, కె5, కొత్తూరు, కె7, కె8, కె9, కె10, కె11 గ్రామాలలోనూ పలువురు అంతర్గత నిర్వాసితులతో హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూలు.

[313] 2007 నవంబర్ 30న వరంగల్ జిల్లా డబ్ల్యూ4 గ్రామంలోని బారెంకు చెందిన అంతర్గత నిర్వాసితుడు దిలీప్‌తో (మారుపేరు) హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూ; 2007 డిసెంబర్ 2–7 మధ్య దంతెవాడ, బిజాపూర్ జిల్లాలలో వివిధ గ్రామాలలోనూ, వరంగల్ జిల్లాలోని కె2, కె5, కె10 గ్రామాలలోనూ చాలామంది అంతర్గత నిర్వాసితులతో జరిపిన ఇంటర్వ్యూలు.

[314] 2007 డిసెంబర్ 7న కె. భాస్కర్‌తో హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూ

[315] 2007 నవంబర్ 29–డిసెంబర్ 6 మధ్య దంతెవాడ, బిజాపూర్ జిల్లాలోని వివిధ గ్రామాలలోనూ, ఖమ్మం, వరంగల్ జిల్లాలలోని డబ్ల్యూ1, డబ్ల్యూ3, డబ్ల్యూ4, కె4, కొత్తూరు, కె7 గ్రామాలలోనూ పలువురు అంతర్గత నిర్వాసితులతో హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూలు.

[494] 2007 నవంబర్ 28న హ్యూమన్ రైట్స్ వాచ్ జె.పి. రావుతో జరిపిన ఇంటర్వ్యూలు (మొదటి ఇంటర్వ్యూ);2007 నవంబర్ 29న వరంగల్‌కు చెందిన ఎన్3 (పేరు తదితర వివరాలను ఇవ్వడం లేదు) అనే స్థానిక కార్యకర్త; 2007 డిసెంబర్ 4న డా. హనీఫ్‌తో హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూ, మొదటి ఇంటర్వ్యూ; ఎన్‌సిపిసిఆర్, "దంతెవాడ, ఖమ్మం జిల్లాల పర్యటన," పేజి.7.

[495] ఎన్‌సిపిసిఆర్, "దంతెవాడ, ఖమ్మం జిల్లాల పర్యటన," పేజి.7.

[496] 2007 డిసెంబర్ 4న డా. హనీఫ్‌తో హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూ, మొదటి ఇంటర్వ్యూ.

[497] పైన సూచించినదే.

[498] 2007 నవంబర్ 29న వరంగల్ జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ, ఏటూరునాగారం, ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్. సుందర్ అబనెర్‌తో హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూ.

[499] 2007 డిసెంబర్ 7న డా. హనీఫ్‌తో హ్యూమన్ రైట్స్ వాచ్ ఇంటర్వ్యూ, రెండవ ఇంటర్వ్యూ.

# కృతజ్ఞతలు

పిల్లల హక్కుల విభాగంలో అడ్వకసీ డైరెక్టరుగా పనిచేస్తున్న రచయిత కూడా అయిన జో బెకర్, ఆసియా విభాగంలో పరిశోధకురాలిగా పనిచేస్తున్న మీనాక్షి గంగూలీ కలిసి నిర్వహించిన పరిశోధన ఆధారంగా – అరుణా కాశ్యప్, అలన్ ఆర్, బార్బారా డి ఫిన్‌బర్గ్ (ఫెలో, హ్యూమన్ రైట్స్ వాచ్) కలిసి ఈ నివేదికను రాశారు.

జో బెకర్, మీనాక్షి గంగూలీ, జోసెఫ్ శాండర్స్, డిప్యూటీ ప్రోగ్రాం డైరెక్టర్లు – ఈ నివేదికను ఎడిట్ చేసారు. బిల్ ఫెర్లిక్, డైరెక్టర్, రెఫ్యూజీ పాలసీ డివిజన్, బ్రాడ్ ఆడమ్స్, డైరెక్టర్ ఆసియా డివిజన్ కలిసి ఈ నివేదికను సమీక్షించారు.

పౌలా సిల్‌వీరా, ఇంటర్న్, పిల్లల హక్కుల విభాగం, చాలా ముఖ్యమైన పరిశోధక సహాయాన్ని అందించారు. ఇంకా కెంజి కిజుకా, పిల్లల హక్కుల విభాగం, అన్నా లో ప్రియోర్, క్రియేటివ్ మేనేజర్, ఆంద్రూహోలీ, పబ్లికేషన్ డైరెక్టర్, గ్రేస్ ఛోయీ, పబ్లికేషన్ స్పెషలిస్ట్, ఫిట్‌జ్రాయ్ హెప్కిన్స్, మెయిల్ మేనేజర్ – ఈ రిపోర్టు రాయడంలో అన్ని విధాలా సహాయపడ్డారు.

స్థానిక ఎన్‌జివోలకు, కార్యకర్తలకు, మానవతావాదులకు, న్యాయవాదులకు, ప్రత్యేకించి ఈ పరిశోధనకు, రిపోర్టు తయారీకి సహాయపడిన కె. బాలగోపాల్, మానవ హక్కుల వేదిక, ప్రొఫెసర్ జె.పి. రావ్, సితారా సంస్థ, వనవాసి చేతనాశ్రమం, భద్రతా కారణాలరీత్యా పేర్కొనలేకపోతున్న ఇతరులు – అందరికి ధన్యవాదాలు. ఈ నివేదికలో వెలువరించిన అభిప్రాయాలన్నీ హ్యూమన్ రైట్స్ వాచ్‌వే. జరిగిన దోషాలకు పూర్తి బాధ్యత మాదే.

అందరికంటే, జరిగిన ఉల్లంఘనలన్నీ ప్రచురించబడాలనీ, బాధ్యులు బయటపడాలనే ఉద్దేశ్యంతో తమ విషాద అనుభవాలను మరోసారి గుర్తుతెచ్చుకున్న బాధితులకు, సాక్షులకు, ఎస్‌పివోలకు, మాజీ నక్సలైట్లకు మా కృతజ్ఞతలు. సుదీర్ఘ ఇంటర్వ్యూలకు సహకరించిన ప్రభుత్వాధికారులను కూడా మేము మరిచిపోలేం. ఈ సమస్యకున్న సున్నితమైన అనేక కారణాల వలన – వెలకట్టలేని సహాయం అందించిన అనేకమంది పేర్లను మేము పేర్కొనడం లేదు.

ఆర్థిక సహాయం అందించిన – కొర్డాయిడ్, ది కౌంటెస్ మొయిరా ఛారిటబుల్ ఫౌండేషన్, ది ఓక్ ఫౌండేషన్, ది ఇండిపెండెంట్ ఫౌండేషన్, ది మాల్కాం హెవిట్ వీనర్ ఫౌండేషన్, ఐసన్‌బర్గ్ ఫామిలీ ఛారిటబుల్ ట్రస్ట్‌లకు మా కృతజ్ఞతలు.